

లో ఓల్టేజ్‌కు చెక్

నరసాపురం, పాలకొల్లు నియోజకవర్గాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా

- రూ.7 కోట్లతో లైన్ ఇన్, లైన్ అవుట్ పద్ధతిలో పనులు.. టెండర్ల ప్రక్రియ పూర్తి

నరసాపురం, జూన్ 30(ఆంధ్రజ్యోతి):గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. కనీసం లో ఓల్టేజ్ సమస్య పరిష్కారానికి అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయలేదు. ఈ కారణంగా ఐదేళ్లలో పెరిగిన విద్యుత్ కనెక్షన్లు, లోడ్‌కు అనుగుణంగా సబ్‌స్టేషన్ల సామర్థ్యం, కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు నోచుకోలేదు. కూటమి ప్రభుత్వం రాగానే విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని సంకల్పించింది. గ్రామాలు, పట్టణాల్లో లోడ్‌కు అనుగుణంగా కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తూ వస్తున్నారు. నరసాపురం, పాలకొల్లులో ఉన్న డిమాండ్‌ను గుర్తించి దానికి అనుగుణంగా సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సామర్థ్యం పెంచాలని ఈపీడీసీఎల్ నిర్ణయించింది. లోడ్ ఇన్, అవుట్ పేరుతో ప్రస్తుతం వున్న 90 మెగావాట్స్ సామర్థ్యాన్ని మరో 90 మెగావాట్స్‌కు పెంచుతున్నారు. ఇందుకు రూ.7 కోట్లు వెచ్చిస్తున్నారు. ఈ పనులకు టెండర్ల ప్రక్రియను పూర్తిచేశారు. నరసాపురం, పాలకొల్లు (మిగతా 8వ పేజీలో..)

టెండర్ల ప్రక్రియ పూర్తి



రూ.7 కోట్లతో చేపట్టే ఈ పనులకు టెండర్ల ప్రక్రియ పూర్తయింది. త్వరలో పనులు ప్రారంభిస్తాం. పూర్తయితే నరసాపురం, మొగల్తూరు, పాలకొల్లు, యలమంచిలి, పోడూరు ప్రాంతాల్లో లో ఓల్టేజ్ సమస్య ఉండదు. నాణ్యతమైన విద్యుత్‌ను అందించవచ్చు. ఈ పనులకు అవసరమైన కొత్త లైన్ ఏర్పాటుకు కోటి వరకు ఖర్చు అవుతుంది. దీనిని కూడా ఈపీడీసీఎల్ మంజూరుచేసింది.

- మధుకుమార్, ట్రాన్స్‌కో ఈఈ

కనీస సంఖ్యలో విద్యార్థులు లేక పలు ప్రభుత్వ పాఠశాలలు వెలవెలబోతు న్నాయి. వాటిలో చదువుకున్న విద్యార్థుల్లో పలువురు టీసీలు తీసుకుని ప్రైవేటు, ఇతర పాఠశాలల వైపు వెళ్లిపోవడం, కొత్తగా ఒకటో తరగతిలో చేరడానికి కనీస సంఖ్యలో కూడా విద్యార్థులు రాకపోవడంతో వాటి నిర్వహణపై ప్రభుత్వం పునరాలోచనలో పడే పరిస్థితులు కనిపిస్తున్నాయి. కనీస సంఖ్యలో విద్యార్థులు లేని స్కూళ్లలో చదువుతున్న బాల బాలికలకు నష్టం వాటిల్లకుండా, వారిని సమీప ప్రభుత్వ పాఠశాలల్లోకి వెళ్లేలా చర్యలు తీసుకునే అవకాశం కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో ఇటీవలే బదిలీపై ప్రాథమిక పాఠశాలలకు వెళ్లిన వందలాది మంది సెకండరీ గ్రేడ్ టీచర్లను సర్దుబాటు చేయడం విద్యా శాఖకు కష్టతరంగా మారే అవకాశాలు లేకపోలేదు. జూలై 10న నిర్వహించనున్న మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం తర్వాత దీనిపై నిర్ణయం తీసుకునేలా సంకేతాలు వస్తున్నాయి. ప్రస్తుతం విద్యా శాఖను, ఉపాధ్యాయ వర్గాలను కొద్ది రోజులుగా కలవరపెడుతున్న వరుస పరిణామాలపై పరిశీలన ఇది.



జీరో అడ్మిషన్స్



టీచర్లు ఫుల్.. విద్యార్థులు నిల్ !

- వెలవెలబోతున్న ప్రభుత్వ పాఠశాలలు
- అంగన్‌వాడీ కేంద్రాల నుంచి ప్రైవేటు వైపు ఒకటో తరగతిలోకి మళ్లిన చిన్నారులే ఎక్కువ
- 7,914 మందికి చేరిన వారి సంఖ్య 4,275
- ఏలూరు జిల్లాలో ఫస్ట్ క్లాస్‌లో ఒక్కరూ చేరని ప్రాథమిక పాఠశాలల సంఖ్య 131
- ఈ స్కూళ్లను.. టీచర్లను ఏం చేయాలి ? ఎలా సర్దుబాటు చేయాలి ? విద్యా శాఖలో చర్చ

ఏలూరు అర్బన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి):పాఠశాలల పునర్వ్యవస్థీకరణతో ఉమ్మడి పశ్చిమలో 2,921 ప్రభుత్వ పాఠశాలలు ఏర్పడ్డాయి. వీటికి ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే శాటిలైట్ (ఎల్‌కేజీ/యూకేజీ లేదా పీపీ-1, 2) పాఠశాలల సంఖ్య అదనం. గత విద్యా సంవత్సరం మార్చి 31వ తేదీ నాటి విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌ను ప్రామాణికంగా తీసుకుని ఆయా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను నిర్ధారించుకుని ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్ కేడర్ టీచర్లను కేటాయించారు. దీనినే ప్రామాణికంగా తీసుకుని పాఠశాలల వారీగా వెకెన్సీలను ప్రకటించి, సాధారణ బదిలీల కౌన్సెలింగ్ ద్వారా కొన్ని వారాల క్రితమే నూతన స్థానాలకు ఉపాధ్యాయులను నియమించారు. తాజా పరిణామాలు గత అంచనాలను తలకిందులు చేయడం గమనార్హం. ఈ ఏడాది మార్చిలో వున్న ఎన్‌రోల్‌మెంట్ వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభమైన తర్వాత లేకపోవడంతో పలు ప్రభుత్వ పాఠశాలల మూసివేత దిశగా సన్నాహాలు చేపట్టడానికి కారణంగా తెలుస్తోంది. పశ్చిమ గోదావరి జిల్లాలో మొత్తం 1,00,963 మంది విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌ను లక్ష్యంగా నిర్దేశించగా ఈ నెల 28 నాటికి 86,158 మందిని (85 శాతం) చేర్చారు. ఒకటో తరగతిలోకి కొత్త అడ్మిషన్లు 7,914 మందికి ఇవ్వాల్సి ఉండగా గత శనివారం నాటికి కేవలం 4,275 మంది (54 శాతం)ని మాత్రమే ప్రభుత్వ పాఠశాలల్లోకి చేర్చగలిగారు. ఇక ప్రాథమిక విద్యలో ఐదో తరగతి ఉత్తీర్ణత పొంది ప్రాథమికోన్నత/ హైస్కూలు విద్యలో ఆరో తరగతిలోకి ప్రవేశాల(ట్రాన్సిషన్)ను 10,822 మంది బాలబాలికలు పొందాల్సి ఉండగా 8,465 మంది(78.2 శాతం) ప్రభుత్వ (మిగతా 8వ పేజీలో..)

ఎందుకిలా జరిగింది ?

- విద్యార్థుల సంఖ్య పరిమితితో నిమిత్తం లేకుండా అర్హులైన వారందరికీ తల్లికి వందనం ఆర్థికసాయం రూ.13 వేలు చొప్పున చెల్లించడం ప్రభుత్వ పాఠశాలలకు గట్టి దెబ్బ కొట్టిందని ఉపాధ్యాయ వర్గాలు చెబుతున్నాయి.
- ఆర్థిక సాయం అందుకున్న వారిలో పలువురు టీసీలు తీసుకుని ప్రైవేటు పాఠశాలలకు వెళ్లిపోవడం, నేరుగా ఒకటో తరగతిలో ప్రైవేటు స్కూళ్లలో అడ్మిషన్ తీసుకోవడమో జరిగింది.
- పలు ప్రైవేటు పాఠశాలలు అడ్మిషన్లు పెంచుకునేందుకు వన్ ప్లస్ వన్ ఆఫర్లను అమలు చేశాయి. తల్లికి వందనం ఆర్థిక సాయం అందుకున్న వారిలో ఇద్దరు పిల్లలుంటే వారిలో ఒకరి నుంచే రూ.15 వేలు ఫీజు వసూలు చేసి, మరొకరికి ఉచితంగా ప్రవేశాలు కల్పించడంతో తల్లితండ్రులు ప్రైవేటు ఆఫర్లవైపు ఆకర్షితులయ్యారు.
- కొన్ని ప్రైవేటు స్కూళ్లలో విద్యార్థి ఇంటి నుంచే ఉచితంగా బస్సు సౌకర్యాన్ని పాఠశాలకు రాకపోకలు కల్పించినట్లు చెబుతున్నారు.

నేడు పెన్షన్‌ల పంపిణీ

భీమవరం టౌన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తిచేశారు. జూలై పింఛన్లను మంగళవారం ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రానికి నూరు శాతం వారి ఇంటి వద్దే ఇచ్చే విధంగా సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో 2,23,837 మందికి రూ.96.50 కోట్లు పెన్షన్‌లుగా అందిస్తారు.

నేటి నుంచి రేషన్ పంపిణీ

భీమవరం టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి):రేషన్ షాపుల ద్వారా ఈ నెల ఒకటి నుంచి 15వ తేదీ వరకు సరుకులు పంపిణీ చేయనున్నారు. జిల్లాలో ఐదు లక్షల 58 వేల రేషన్ కార్డులకు పంచదార, బియ్యం అందించనున్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం నాలుగు నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు సరుకులను అందిస్తారు. గత నెల 26 నుంచి 30వ తేదీ వరకు 71 వేల 674 మంది వికలాంగులు, వృద్ధులకు గాను 45 వేల మందికి వారి ఇళ్ల వద్దే రేషన్ అందించారు. మిగి లిన వారికి 15వ తేదీ వరకు అందిస్తారు.

కాంట్రాక్టర్ సస్పెన్షన్

ఆకివీడు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులకు ఆటంకం కల్గిస్తున్న కాంట్రాక్టర్ కుంపట్ల శ్రీరామ్‌ను ఏడాది పాటు సస్పెండ్ చేస్తూ నగర పంచాయతీ ఏకగ్రీవ తీర్మానం చేసింది. సోమవారం స్థానిక కార్యాలయంలో చైర్మన్ జామి హైమావతి అధ్యక్షతన సమావేశం జరిగింది. మూడు అభివృద్ధి పనులకు ఈ ప్రొక్యూర్‌మెంట్ ద్వారా గతంలో టెండర్లు పిలిచారు. అయితే శ్రీరామ్ తక్కువ కోడ్‌కు టెండర్లు వేశాడు. అభివృద్ధి పనులు చేయకుండా కాలయాపన చేస్తూ ప్రజా ప్రతినిధుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నాడని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఏడాది పాటు టెండర్లలో పాల్గొన కుండా నిషేధం విధించారు. అంతే కాకుండా మూడు అభివృద్ధి పనులకు టెండర్లు రద్దుచేశారు. పట్టణ పరిధిలోని ఆనాల, దొర, భుజబలరాయుడు మంచినీటి చెరువుల దగ్గర ట్రాన్స్‌పార్మర్లు ఏర్పాటుకు తీర్మాణం జరిగింది.

ఆక్వాకు అండగా..

- పారదర్శక జోన్ వ్యవస్థ కోసం గ్రామసభలు
- ప్రతి రైతుకు లబ్ధి చేకూరేలా ప్రభుత్వ ప్రణాళిక

భీమవరం రూరల్, జూన్ 30(ఆంధ్రజ్యోతి):ఆక్వా రంగానికి ఊతమిచ్చే దిశలో ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేస్తోంది. ఆక్వా జోన్ పరిధిని విస్తరించాలా ? తగ్గించాలా ? ఆక్వా సాగు చేసేందుకు ముందుకు వచ్చే రైతులకు అనుమతి ఇవ్వాలా ? వద్దా ? వంటి అంశాలపై వారితో చర్చించి, పారదర్శక జోన్‌ల వ్యవస్థకు శ్రీకారం చుట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు జూన్ 25వ తేదీ నుంచి ఈ నెల మూడో తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా సచివాలయాల్లో గ్రామసభలు నిర్వహిస్తోంది. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ఆక్వా జోన్ విధానంతో రైతులు నష్టపోయారు. దీనిని సరిచేసేందుకు గ్రామసభల ద్వారా రైతుల అభిప్రాయాలను తీసుకుంటుంది. జిల్లాలో గ్రామాల వారీగా మత్స్యశాఖ ఆధ్వర్యంలో సభలు జరుగుతున్నాయి. మూడో తేదీతో పూర్తికావాలి. గ్రామాలు మిగిలి ఉంటే మరికొన్ని రోజులు కేటాయిస్తారు. రైతుల నుంచి పూర్తి వివరాలు సేకరించే లక్ష్యంతో ప్రభుత్వం వుంది.

కమిటీల ద్వారా రాష్ట్రానికి నివేదిక

ప్రస్తుతం జోన్ వ్యవస్థపై గ్రామసభలు పూర్తయ్యాక రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపించాలి. ముందుగా గ్రామాల వివరాలను మండల కమిటీకి, మండలాల వివరాలను జిల్లా కమిటీకి, జిల్లా వివరాలను రాష్ట్ర కమిటీకి పంపిస్తారు. ఈ జాబితాను అనుసరించి రాష్ట్ర కమిటీ పారదర్శక జోన్ వ్యవస్థను ఏర్పాటు చేస్తుంది. ఆక్వా సాగులో ప్రధానంగా రైతులు కోరుకునేది విద్యుత్ సబ్సిడీని. ఇదే వారికి పెద్ద భరోసా. ప్రతి రైతు ఈ జోన్ పరిధిలో తమ చెరువులు ఉండాలని కోరుకుంటారు. ఈ జోన్‌లో వుంటే సబ్సిడీ ద్వారా యూనిట్ విద్యుత్ రూ.1.50పై అందుతుంది. అలాంటి దాన్ని గత ప్రభుత్వం జోన్ వ్యవస్థ కొత్తగా తీసుకువస్తున్నామని, అర్హులైన రైతులను విద్యుత్ సబ్సిడీకి రాని వారి జాబితాలోకి తీసుకువెళ్లింది. ఆ సమయంలో కొన్నేళ్ళుగా సబ్సిడీ వస్తుంటే ఇప్పుడు అనర్హులు చేస్తారా అని రోడ్డెక్కారు. భీమవరం మండలంలోని ఒక సచివాలయంలో అధికారులు ఉండగా ఆక్వా రైతులు తలుపులు తాళం వేసి నిరసన తెలిపారు. జిల్లాలో 50 శాతం రైతులు అనర్హులు జాబితాలోకి వచ్చారు. ప్రస్తుతం జిల్లా ఆక్వా సాగులో 16,456 రైతులు విద్యుత్ పొందుతున్నారు. పారదర్శక జోన్‌ల వ్యవస్థ వస్తే వేలాది మంది రైతులు విద్యుత్ సబ్సిడీ పొందే జాబితాలోకి వస్తారు.



మూడేళ్లుగా ఆక్వా రంగం కుదేలైంది. మేత ధరలు పెరిగిపోయాయి. రొయ్య, చేపల ధరలు పడిపోయాయి. దీంతో రెండేళ్లుగా 40 శాతం సాగు సక్రమంగా సాగడం లేదు. ఖాళీ చెరువులుగా దర్శనమిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రొయ్య ధరలు నిలకడగా ఉండేలా చేసింది. ఇప్పుడు జోన్ వ్యవస్థ చక్కదిద్దితే రైతులు మునుపటిలా ముందుకు సాగే అవకాశం ఉంది.

పశువులపై చిన్నచూపు..!



పెరిగిన ఖర్చులతో రైతులు పాడికి దూరం

- జిల్లాలో తగ్గుతున్న పాల ఉత్పత్తి
- రెండు లక్షల 23 వేల 676 పశువులు
- గతంకంటే లక్షకు పైగా తగ్గిన సంఖ్య
- 3,43,855 మెట్రిక్ టన్నుల పాల దిగుబడి

(భీమవరం రూరల్-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో పశువుల పెంపకం తగ్గుతోంది. పెట్టుబడి పెరగడం, ఉత్పత్తి తగ్గడంతో రైతులు పశువులను పెంచేందుకు ఆసక్తి చూపడం లేదు. దీంతో ఏటా పాల ఉత్పత్తి పడిపోతూ వస్తోంది. దశాబ్ద కాలానికి ఇప్పటికీ పశువులపెంపకం సగానికి పడిపోయింది. పదేళ్ల క్రితం జిల్లాలో మూడు లక్షలకు పైగా పశువులు వుంటే.. ప్రస్తుతం లక్షా 78 వేల 137 గేదెలు, 45 వేల 539 ఆవులు వెరసి రెండు లక్షల 23 వేల 676 పాలు ఇచ్చే పశువులు ఉన్నాయి. ఫలితంగా పాల ఉత్పత్తి తగ్గింది. 2024-25 లెక్కల ప్రకారం ఏడాదికి పాల ఉత్పత్తి మూడు లక్షల 43 వేల 855 టన్నులుగా ఉంది. అయితే, ఉత్పత్తికంటే రెండు రెట్లు ఎక్కువ పాలు వినియోగం ఉండడం విశేషం.

తగ్గిన ప్రోత్సాహకాలు

పశువుల పెంపకంలో ప్రభుత్వం నుంచి వచ్చే ప్రోత్సాహకాలు తగ్గాయి. గడ్డివిత్తనాలు ఇచ్చి, గడ్డి పెంపకానికి 80 శాతం పెట్టుబడి అందించేవారు. అది గడిచిన ప్రభుత్వంలో నిలిచిపోయాయి. నాణ్యమైన దాణా కూడా సబ్సిడీపై అందించడం లేదు. కూటమి ప్రభుత్వం ఇప్పుడిప్పుడే అందిస్తోంది. గోకులం షెడ్లు ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. జిల్లాలో మొదటి దఫా 900 మినీ గోకులం షెడ్లు, రెండో దఫా మరో 900 షెడ్ల ఏర్పాటుకు అవకాశం ఇచ్చింది.

ఎండు గడ్డి కొరత... ధరలు ఎక్కువ

ఎండు పశుగ్రాసంలోనే పశువులు పెంచే రైతులకు పెద్ద చిక్కొచ్చి పడింది. ప్రతి పంటలోను మాసూళ్ల గండం పొంచి చూస్తోంది. వరి కోత యంత్రాల మీద, పంట మాసూళ్ల వచ్చాక ఆ సమయంలో వర్షాలు పడితే గడ్డి పనికి రాక కొరత ఏర్పడుతోంది. జిల్లాలో ఏడాదికి మూడు లక్షల 46 వేల 978 టన్నుల ఎండుగడ్డి అవసరం. దాని నిల్వకు రైతులు భారీగా సొమ్ములు చెల్లించాల్సి ఉంటుంది. ట్రాక్టర్ గడ్డి రూ.10 వేలకు పైబడి ధర పెట్టి కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఎండుగడ్డి ధర భారంగా మారింది. గతంలో ఎండుగడ్డి రైతుల నుంచి ఉచితంగా తీసుకునేవారు.



భారంగా పెంపకం

పశువుల పెంపకంలో గతంలోకి ఇప్పటికి ఎన్నో మార్పులు వచ్చాయి. పాలధర కొంచెం పెరిగితే ముడిసరుకు బాగా పెరిగింది. దీంతో వచ్చే ఆదాయం, పెట్టే పెట్టుబడి లెక్కలు వేసి పశువులు పెంచడం మానేస్తున్నారు. ఒక పశువును పెంచాలంటే ఏడాదికి ఎండు గడ్డికి రూ.10 వేలు, దాణాకు రూ.12 వేలు, పనివాడికి రూ.90 వేలు, వెరసి లక్షా 12 వేలు అవుతుంది. పశువు నుంచి పాల ఉత్పత్తి మాత్రం సుమారు రూ.70 వేలు వస్తోంది. మరోవైపు పశుసంపద తగ్గిపోవడంతో ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. గతంలో గేదె రూ.20 వేలు, 30 వేలు ఉంటే ఇప్పుడు రూ.80 వేల నుంచి రూ. లక్షా 50 వరకు పలుకుతోంది. అంత పెట్టుబడి పెట్టి దానికి వడ్డీ లెక్క వేసినా రైతులు ఆ వడ్డీతో పాలు కొనడం మేలని అనుకుంటున్నారు. ఒక వేళ ఆ పశువు సూడిది కాకపోతే దాని అమ్మకం ధరలో మూడొంతులు పడిపోతుంది.

పాలు కొనడమే మేలు



పశువుల పెంపకం చాలా ఖరీదుగా మారింది. గతంలో రూపాయి ఖర్చు లేకుండా పశువులను పెంచేవాళ్లం. ఇప్పుడలా లేదు. గడ్డి కూడా కొనాల్సిందే. దాణా ధరలు వేలల్లో పలుకుతున్నాయి. పశువును పెంచడానికి అయ్యే ఖర్చుతో పోలిస్తే పాలు కొనుగోలు చేసుకోవడం మేలనిపిస్తోంది.

- ఏడుకొండలు, పెదగరువు

సమస్యలు పరిష్కరించాలి

- ప్రజా ఫిర్యాదులపై కలెక్టర్ నాగరాణి ఆదేశం

భీమవరం టౌన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన ఫిర్యాదులను జవాబుదారీతనంతో పరిష్కరించాలని కలెక్టర్ సీహెచ్ నాగరాణి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జేసీ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, డీఆర్వో మొగిలి వెంకటేశ్వర్లు, గ్రామ వార్డు సచివాలయం అధికారి వై.దోసిరెడ్డి, కేఆర్‌ఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణరెడ్డి, డ్వామా పీడీ అప్పారావుతో కలిసి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన 256 మంది నుంచి అర్జీలు స్వీకరించారు. వీటిలో కొన్ని..

- తాడేపల్లిగూడెం సెంట్ ఆన్స్ హైస్కూల్‌లో తన పెద్ద కుమార్తె బోడపాటి గ్రీష్మశ్రీకి ఫ్రీ సీటు వచ్చినప్పటికి అడ్మిషన్ ఇవ్వడానికి యాజమాన్యం నిరాకరిస్తోందని దర్శిపర్రుకు చెందిన బోడపాటి రమేష్ ఫిర్యాదు చేశారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ నాగరాణి, జేసీ రాహుల్

- కూలి పనులు చేసే తమకు ఎలాంటి ఆస్తిపాస్తులు లేవని, తనకు ఇంటి స్థలం ఇప్పించాలని విస్సాకోడేరుకు చెందిన దిద్ది శివాని కోరారు. తన ఇంటి నుంచి కుమారులు ఇద్దరు తనను గెంటివేశారని, తన ఇల్లు తనకు ఇప్పించాలని నరసాపురానికి చెందిన బండి వెంకటనర్సమ్మ కోరారు.
- ఎకరం రెండు సెంట్ల భూమికి కొలతల్లో 98 సెంట్లు మాత్రమే ఉందని, సరిహద్దు భూముల్లో కలిసిన నాలుగు సెంట్ల భూమిని ఇప్పించాలని వీరవాసరం మండలం కొణితవాడకు చెందిన కోడి గాంధీ కోరారు.
- పంచాయతీ వాచ్‌మన్‌గా రిటైర్ అయిన తనకు 2024 జనవరి నుంచి పింఛన్ రావడం లేదని వీటిని ఇప్పించాలని కావలిపురానికి చెందిన తణుకు ప్రసాదరావు కోరారు.
- తనకు 50 సెంట్ల భూమి ఉంటే, జాయింట్ ఎల్‌పీఎం వల్ల 3.40 ఎకరాలు భూమిగా చూపించడంతో తల్లికి వందనం సొమ్ములు పడలేదని బలుసు గొయ్యిపాలెంకు చెందిన కపురు ఝాన్సీ లక్ష్మి ఫిర్యాదు చేశారు.
- తన సరిహద్దు రైతు చేపలకు అనుమతి తీసుకుని రొయ్యల సాగు చేయడంతో తమ చెరువుకు నష్టం కలుగుతోందని చినపులేరుకు చెందిన ఎం.సత్యనారాయణ ఫిర్యాదుచేశారు.

కుటుంబ కలహాలపై ఫిర్యాదులు



భీమవరం క్రైం, జూన్ 30(ఆంధ్రజ్యోతి):జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఏఎస్పీ వి.భీమారావు నిర్వహించారు. కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, భర్త/అత్తారింటి వేధింపులు, భూ-ఆస్తి వివాదాలు, నకిలీ పత్రాలు, అధిక వడ్డీలు, ఆన్‌లైన్ మోసం, ప్రేమ పేరుతో మోసం, ఆస్తి తగాదాలపై 11 అర్జీలను స్వీకరించారు. వీటిపై సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి నిర్ణీత గడువులోగా వీటిని పరిష్కరించాలని ఏఎస్పీ ఆదేశించారు. జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీ ఎంవీవీ సత్యనారాయణ, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సహకారంలో చోటెవరికి ?

- ఈ వారంలోనే సొసైటీలకు త్రిసభ్య కమిటీలు !
- కూటమిలో చాన్నాళ్ల నుంచి ఎదురుచూపులు
- క్షేత్రస్థాయిలో పెరుగుతూ వస్తున్న ఒత్తిడి
- ఇప్పటికే మూలనపడ్డ సహకార వ్యవస్థ

కొల్లేరు సమస్య పరిష్కారానికి కృషి చేస్తా

అధికారులు అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తున్నారన్న ఏలూరు ఎంపీ పుట్టా

వృద్ధులకు భరోసా



- ఒంటరి మహిళలకు ఆసరా.. దివ్యాంగులకు చేయూత
- ఏడాది క్రితం ఇదే రోజు పెంచిన పెన్షన్ అందజేత
- లబ్ధిదారుల కళ్లల్లో ఆనందం

- పూర్తి వివరాలు 6, 7 పేజీల్లో

ఉగ్ర నారసింహుడిగా జగన్నాథుడు



ద్వారకాతిరుమల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఉగ్ర నారసింహునిగా జగన్నాథుడు సోమవారం భక్తులకు దర్శనమిచ్చారు. ద్వారకాతిరుమల పురాతన లక్ష్మీపురం ఆలయంలో ప్రారంభమైన జగన్నాథుని రథోత్సవాలు పురస్కరించుకుని స్వామివారు రోజుకో అలంకారంలో భక్తులకు దర్శన మిస్తున్నారు. ఇందులో భాగంగా పూరీ క్షేత్రం నుంచి తెచ్చిన సుభద్ర, బలభద్ర, జగన్నాథుల దారు విగ్రహాలకు దశావతార అలంకారాలను చేపట్టారు. సోమవారం జగన్నాథస్వామి శంఖు, చక్రాలను ధరించి, ఉగ్రరూపంలో భక్తజనులకు అభయహస్తాన్ని ప్రసాదిస్తున్నట్లున్న నరసింహుని అలంకారం చూపరులకు కనువిందు చేసింది.

శాకాంబరిగా అన్నపూర్ణాదేవి



భీమవరం టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ఆషాఢ మాసం పంచమి సోమవారం పురస్కరించుకుని పంచారామ క్షేత్రమైన గునుపూడిలోని సోమేశ్వర స్వామి ఆలయంలోని అన్నపూర్ణాదేవిని శాకాంబరీ అమ్మవారుగా అలంకారం చేశారు. తెల్లవారుజామున ఆలయ అర్చకులు చెరుకూరి రామకృష్ణ ప్రత్యేక పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ఈవో రామకృష్ణంరాజు పర్యవేక్షించారు.

అరుణాచల యాత్రకు ప్రత్యేక బస్సులు

ఏలూరు జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి షేక్ షబ్నం



ఏలూరు క్రైం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : గురు పౌర్ణమి సందర్భంగా అరుణాచలం గిరి ప్రదక్షిణకు ప్రత్యేక యాత్ర నాలుగు రోజులు కొనసాగుతుందని జిల్లాలో ఉన్న మూడు బస్సు డిపోల నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నామని ఏలూరు జిల్లా ప్రజా రవాణా శాధికారి షేక్ షబ్నం తెలిపారు. నూజివీడు, జంగారెడ్డిగూడెం, ఏలూరు డిపోల నుంచి ఈనెల 8వ తేదీ సాయంత్రం 6 గంటలకు బస్సులు బయలుదేరి 9వ తేదీ శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం దర్శనం అనంతరం అదే రోజురాత్రి అరుణాచలం చేరుకుంటుందన్నారు. 10వ తేదీ ఉదయం గిరి ప్రదక్షణ అనంతరం కంచి కామాక్షి అమ్మవారి దర్శనం చేసుకుని తిరిగి వస్తారన్నారు. ఈ బస్సు టిక్కెట్ ఒక్కొక్కరికి రూ.మూడు వేలని, మిగిలిన ఖర్చులు ప్రయాణికులు ఎవరికి వారే భరించుకు కోవాలన్నారు.

అమ్మవార్ల దర్శనానికి ప్రత్యేక బస్సులు

భక్తుల కోరికపై ఆషాఢ, శ్రావణ మాస సందర్భంగా ప్రతి ఆదివారం కేవలం అమ్మవార్ల దర్శనానికి సప్తమాతృక దర్శనం, ప్రత్యేక టూర్ ప్యాకేజీ ఏర్పాటు చేశామన్నారు. ఈ బస్సులు మూడు డిపోల నుంచి తెల్లవారు జామున నాలుగు గంటలకు బయలుదేరి కొల్లేటి కోట పెద్దింట్లమ్మ, భీమవరం మావుళ్ళమ్మ, పెనుగొండ శ్రీవాసవి మాత, నిడదవోలు కోట సత్తెమ్మ, ద్రాక్షారామం ద్రాక్షాయణి, పిఠాపురం పురూహూతిక మాత (అష్టదశాపీఠం), పెద్దాపురం మరిడమ్మ దర్శన అనంతరం తిరిగి గమ్యస్థానానికి చేరుకోవచ్చన్నారు. ఈ ప్యాకేజీకి సంబంధించిన టిక్కెట్లు కావాల్సిన వారు ఏలూరు డిపో సెల్ నంబర్ 93467 67670, రిజర్వేషన్ కౌంటర్ 63038 59484, జంగారెడ్డిగూడెం డిపో నంబర్ 94929 49350, నూజివీడు డిపో నంబర్ 73829 01757లలో సంప్రదించాలన్నారు. ఒకే ఊరు నుంచి 36 మంది ప్రయాణికులు ఉంటే సమీప డిపో మేనేజర్‌ను లేదా ఫోన్ నంబర్లలో సంప్రదిస్తే ఆ ఊరు నుంచి ప్రత్యేక బస్సు ఏర్పాటు చేస్తారన్నారు.

3 నుంచి రైల్వే గేటు మూసివేత

కైకలూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 3 నుంచి 7వ తేదీ వరకు కైకలూరు-కలిదిండి ఆర్అండ్‌బీ రహదారిలోని ఎల్‌సీ నంబర్-82 రైల్వే గేటును మరమ్మతుల నిమిత్తం మూసివేస్తున్నట్లు కైకలూరు రైల్వేస్టేషన్ మాస్టర్ అబ్దుల్ రహమాన్ తెలిపారు. 3వ తేదీ ఉదయం 7 గంటల నుంచి 7వ తేదీ రాత్రి 7 గంటల వరకు మరమ్మతు పనులు నిర్వహిస్తామని ఈ రహదారిలో ప్రయాణించే వారు గమనించాలని సూచించారు.

ఆనందమే..!



వృద్ధులకు భరోసా..
ఒంటరి మహిళలకు ఆసరా
దివ్యాంగులకు చేయూత
ఏడాది క్రితం ఇదే రోజు పెంచిన పెన్షన్ అందజేత
లబ్ధిదారుల కళ్లల్లో ఆనందం

భీమవరం టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత సంవత్సరం ఇదే రోజున వృద్ధుల కళ్లల్లో వెలుగులు నింపింది. ఒకేసారి రూ. 4 వేల పెన్షన్ మంజూరు చేసింది. అంతకు ముందు మూడు నెలలకు సంబం ధించిన పెండింగ్ రూ. 3 వేలు కలిపి ఒకేసారి లబ్ధిదారులకు రూ. 7 వేలు అందజేసింది. ఆ తర్వాత నుంచి క్రమం తప్పకుండా ఒకటో తేదీన వృద్ధుల చేతిలో పెన్షన్ పెడుతోంది.గత ప్రభుత్వంలో ఏడాదికి ఒకాసిరి రూ.250 పెంచుతూ వచ్చారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు పెన్షన్‌లు రూ.4000 ఇస్తామని ప్రకటించి నట్టుగానే మాట నిలబెట్టుకుంది. అనారోగ్యం. వయోభారం ఇతర కారణాలతో మంచంపై ఉండే బాధితులకు రూ. 15 వేలు వంతున దివ్యాంగులకు రూ. 6 వేలు అందిస్తున్నారు. పండుగలు, లేదా సెలవులు వస్తే 1వ తేదీకి కంటే ముందుగా రోజున పెన్షన్‌లను అందిస్తోంది. దాదాపు సంవత్సరం కాలంగా ఎక్కడ ఇబ్బందులు లేకుండా పెన్షన్‌ను కూటమి ప్రభుత్వం అందించడంతో అందరిలోను ప్రభుత్వం పట్ల సానుకూలత ఏర్పడింది. ప్రభుత్వం ఆర్థిక భారం పడినా సరే క్రమం తప్పకుండా పెన్షన్ అందచేస్తున్నారు.

సెలవైతే ముందురోజే

గత ప్రభుత్వంలో రూ.60 కోట్లు మాత్రమే పెన్షన్ రూపంలో వృద్ధులకు, ఒంటరి మహిళలకు, దివ్యాంగు లకు అందించారు. కూటమి ప్రభుత్వం పెన్షన్ పెంచడంతో ప్రతినెలా పెన్షన్ లబ్ధిదా రులకు రూ.96.51 కోట్లు పంపిణీ చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తరువాత పెన్షన్‌ను ఒకరోజు ముందు అందించింది. దాదాపు 4 సార్లు ఈ విధంగా పెన్షన్ ముందుగా ఇవ్వటం వల్ల లబ్ధిదారుల్లో సంతృప్తి వ్యక్తం అవుతోంది. పెన్షన్ పెంచడం వల్ల ఆర్థికంగా భరోసా వచ్చిందని చెబుతున్నారు. ఈ పెంపు ఎంతో సంతృప్తిగా ఉందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఆర్థిక భరోసా వచ్చింది



రూ.4 వేలు పెన్షన్ ఇవ్వడం వల్ల వృద్ధులకు ఆర్థి కంగా భరోసాగా ఉంది. వెయ్యి రూపాయిల నుంచి పెన్షన్ తీసుకుంటున్నాను. ఏడాదిగా ఎటువంటి ఇబ్బందిలేకుండా 1వ తేదీన పెన్షన్ అందిస్తున్నారు. ఎంతో సంతృప్తిగా ఉంది.

అప్పల నర్సమ్మ,భీమవరం, చేపల బజార్‌రోడ్డు

వ్యాపారానికి ఉపయోగపడుతోంది



ప్రభుత్వం ఇస్తున్న రూ.4 వేలు ఎంతో ఉపయోగంగా ఉంటోంది. కొద్దిపాటి సోమ్ముతో రొయ్యలు కొనుగోలు చేసుకుని వ్యాపారం చేసుకుంటున్నాను. మందుల ఖర్చు లకు, కుటుంబానికి ఉపయోగపడుతోంది.

కట్టా సత్యవతి, జాలర్ల వీధి, భీమవరం

ముందస్తు పెన్షన్ భరోసా



గతంలో 1వ తేదీన సెలవు వస్తే మరుసటి రోజు పెన్షన్ ఇవ్వడం వల్ల కొంత ఇబ్బంది ఉండేది. ఇప్పుడు 1వ తేదీ సెలవు వస్తే ముందు రోజు పెన్షన్ ఇస్తు న్నారు. ఇది పేదలకు ఆర్థికంగా భరోసాగా నిలచింది. పైగా ప్రతీ నెల 1వ తేదీన పెన్షన్ ఇవ్వడం వల్ల వృద్ధులకు మందుల ఖర్చులకు, ఇతర అవసరాలకు ఎంతగానో ఉపయోగంగా ఉంది. పెన్షన్ పెంపు ఉపయోగపడుతోంది.

తిరువాడ పెద్దింట్లు, చేపల బజార్, భీమవరం

మందుల ఖర్చులకు ఆసరా



ఈ ప్రభుత్వం వెయ్యి పెంచి రూ.4 వేలు ఇవ్వడం వల్ల మాలాంటి వారికి ఎంతో ఉపయోగంగా ఉంది. మందులకు ఉపయోగపడుతోంది. పెన్షన్ అందించటంలో కూడా జాప్యం ఉండటం లేదు . ఎంతో ఆనందంగా ఉంది.

-ఈదల సోమయ్య, భీమవరం

ఆర్థికంగా చేదోడు ..



ఈ ప్రభుత్వం దివ్యాంగులకు 3 వేల నుంచి రూ.6 వేలు చెయ్యడం మంచి భరోసాగా ఉంది. కుటుంబ పోషణకు కొంత సాయంగా ఉంటోంది. మాలాంటి వారికి మంచి సహకారమే

- ఏసు, పతివాడ వారివీధి, భీమవరం

అదనపు లోడ్‌కు రాయితీ

దరఖాస్తులకు ముగిసిన గడువు
ఏలూరు సర్కిల్ పరిధిలో వచ్చిన దరఖాస్తులు 12,279
మొత్తం కిలోవాట్లు 20097.68
వసూలైన మొత్తం రూ. 2.25 కోట్లు



ఏలూరుసిటీ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గృహవిద్యుత్‌లో వినియోగించే విద్యుత్ వాడకానికి సంబంధించి అదనపు విద్యుత్ వాడుతున్న వినియోగదారులకు ప్రత్యేక డ్రైవ్‌లో అదనపు లోడ్‌కు రాయితీ కల్పించి ఈనెల 30వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని ఏపీ ఈపీడీసీఎల్ ఏలూరు జిల్లా విద్యుత్ శాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఆన్‌లైన్ విధానంలోనే జిల్లాలో అదనపు లోడ్ వినియోగిస్తున్న విద్యుత్ వినియోగదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ గడువు సోమవారంతో ముగిసింది. జిల్లాలో రోజురోజుకు విద్యుత్ వినియోగంలో అదనపు లోడ్ పెరుగుతుండటంతో విద్యుత్ అంతరాయాలు ఏర్పడుతున్నాయి. విద్యుత్ వినియోగదారులు తాము రిజిస్టరు చేయించుకున్న దానికంటే అదనంగా విద్యుత్‌ను వినియోగిస్తున్నారని విద్యుత్ అధికారులు గుర్తించారు. ఎప్పటికప్పుడు విద్యుత్ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేసి అదనపు లోడ్ వినియోగిస్తున్న వినియోగ దారుల నుంచి అపరాధ రుసుం వసూలు చేసేవారు.వినియోగదారులు పడుతున్న ఇబ్బందులు గమనించి రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ అదనపులోడ్ వినియోగించుకునే వారికి వారు ప్రస్తుతం వినియోగించే విద్యుత్ వాడకంలో అదనపు లోడ్‌కు సంబంధించి రాయతీని కల్పించారు. దీని ప్రకారం డెవలప్‌మెంట్ చార్జీలలో 50 శాతం రాయితీ కల్పించింది. ఈనెల 30వ తేదీలోగా అదనపు లోడ్ ఉన్న విద్యుత్ వినియోగదారులు అదనపులోడ్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.దీనిప్రకారం ఒక కిలోవాట్‌కు దరఖాస్తు ఫీజు 50 రూపాయలు, సెక్యూరిటీ డిపాజిట్ 200, డెవలప్‌మెంట్ చార్జీలు రూ.2 వేలు చెల్లించాల్సి ఉంది. విద్యుత్ శాఖ ప్రకటించిన వీడీఎస్ పథకంలో ఒక కిలోవాట్‌కు రూ.1250,రెండు కిలోవాట్లకు రూ.2450, 3 కిలోవాట్లకు రూ.3650 చెల్లిస్తే సరిపోతుందని పేర్కొంది. ఈ ప్రకారం జిల్లాలోని ఏలూరు విద్యుత్ సర్కిల్ పరిధిలో 12,279 మంది దరఖాస్తులు చేసుకున్నారు.దీనికి సంబంధించి 20097.68 కిలోవాట్ల అదనపు లోడ్ కావాలని కోరారు. ఈ దరఖాస్తులకు సంబంధించి మొత్తం రూ.225.48 లక్షలు (2.25 కోట్లు) వసూలు అయిందని విద్యుత్ శాఖ నివేదికలు చెబుతున్నాయి. డివిజన్ల వారీగా వచ్చిన దరఖాస్తులు పరిశీలిస్తే ఏలూరు డివిజన్‌లో 16084.78 కిలోవాట్లకు సంబంధించి 9799 మంది దరఖాస్తు చేసుకున్నారు. జంగారెడ్డి గూడెం విద్యుత్ డివిజన్‌లో 4012.9 కిలోవాట్లకు సంబంధించి 2480 మంది భీమడోలు సబ్ డివిజన్‌నుంచి 2430, దెందులూరు సబ్ డివిజన్ నుంచి 2725, ఏలూరు సబ్ డివిజన్ నుంచి 2203, పెదవేగి సబ్ డివిజన్ నుంచి 1703 దరఖాస్తులు రాగా, చింత లపూడి సబ్‌డివిజన్ నుంచి 183, జంగారెడ్డిగూడెం సబ్ డివిజన్ నుంచి 855, జీలుగుమిల్లి సబ్ డివిజన్ నుంచి 86, కామవరపుకోట సబ్ డివిజన్ నుంచి 823, పోలవరం సబ్ డివిజన్ నుంచి 533 మంది దరఖాస్తు చేసుకున్నారు.

దరఖాస్తుదారులందరికీ సౌకర్యం..

గృహ విద్యుత్ వాడకంలో అదనపు విద్యుత్ వినియో గించుకునే వారికోసం అదనపులోడ్ రిజిస్టరు చేసుకునేందుకు రాయతీ ఇచ్చేం దుకు వీడీఎస్ పథకాన్ని స్పెషల్ డ్రైవ్‌లో నిర్వహించాం. జూన్ 30 వతేదీలోగా విద్యుత్ వినియోగదారులు ఈ పథకానికి దరఖాస్తు చేసుకుని డెవలప్‌మెంట్ చార్జీలలో 50 శాతం రాయితీ పొందాలని కోరాం. జిల్లావ్యాప్తంగా 12,279 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారందరికీ అదనపు లోడ్ అవకాశం కల్పిస్తాం.

సాల్మన్‌రాజు, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ , ఏలూరు జిల్లా

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

లుంగీ కట్టు.. మాస్ లుక్!



కిరణ్ అబ్బవరం, యుక్తి తరేజా జంటగా జైన్స్ నాని తెరకెక్కిస్తోన్న చిత్రం 'కె-ర్యాంప్'. హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బేనర్లపై రాజేశ్ దండా, శివ బొమ్మకు నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. కిరణ్ అబ్బవరం లుంగీ కట్టులో మాస్, క్లాస్ కలసిన మేకోవర్‌లో ఆకట్టుకుంటున్నారు. బ్యాక్‌గ్రౌండ్‌లో మందు బాటిల్స్‌తో డిజైన్ చేసిన లవ్ సింబల్ కనిపిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. ఈ దీపావళికి విడుదల చేసేందుకు చిత్రబృందం సిద్ధమవుతోంది.

ఓటీటీలోకి 'తల్లి మనసు'



కమల్ కామరాజు, సాత్విక్, రచిత మహాలక్ష్మీ ప్రధాన పాత్రల్లో ముత్యాల సుబ్బయ్య తెరకెక్కించిన చిత్రం 'తల్లి మనసు'. ముత్యాల అనంత కిశోర్ నిర్మించారు. ఇటీవలె చిత్రం విడుదలైంది. తాజాగా, ఈ సినిమా ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్‌లోకి అందుబాటులోకి వచ్చిందని మేకర్స్ తెలిపారు.

పూజతో ప్రారంభం



తమిళ నటుడు విజయ్ సేతుపతి కథానాయకుడిగా పూరి జగన్నాథ్ ఓ చిత్రాన్ని తెరకెక్కించనున్న సంగతి తెలిసిందే. సోమవారం ఈ చిత్రాన్ని పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు మేకర్స్. విజయ్‌కుమార్, సంయుక్త, టబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఛార్మీ కౌర్ సమర్పణలో పూరి జగన్నాథ్, జేబీ నారాయణరావు కొండ్రోల్లా సంయుక్తంగా సినిమాను నిర్మిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ప్రేక్షకులకు విభిన్నమైన అనుభూతిని ఈ సినిమా ద్వారా అందిస్తామని మేకర్స్ పేర్కొన్నారు. ఈ నెల నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలు కానుంది.

సున్నితమైన హాస్యంతో...



హీరో రాణా దగ్గుబాటి తన నిర్మాణ సంస్థ స్పిరిట్ మీడియా బ్యానర్‌పై రూపొందిస్తున్న చిత్రం 'కొత్తపల్లిలో ఒకప్పుడు'. నూతన దర్శకురాలు ప్రవీణ పరుచూరి తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా గురించి మేకర్స్ మాట్లాడుతూ "సున్నితమైన హాస్యంతో నిండిన చిత్రమిది. అందర్నీ ఆలోచింపజేస్తుంది. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది" అని తెలిపారు. ప్రస్తుతం ఈ చిత్రం నిర్మాణ దశలో ఉంది.

కథలో భిన్న కోణాలుంటాయి



- శ్రీరామ్ వేణు

"తమ్ముడు' సినిమాలో కుటుంబ భావోద్వేగాలు, భిన్న కోణాలు ఉంటాయి. ట్రైలర్‌లో కథ ఎలా ఉండబోతుందో చెప్పాం' అని అన్నారు దర్శకుడు శ్రీరామ్ వేణు. నితిన్ హీరోగా ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'తమ్ముడు'. దిల్ రాజు, శిరీష్ నిర్మించారు. ఈ శుక్రవారం థియేటర్లలో విడుదలవుతున్న సందర్భంగా శ్రీరామ్ వేణు మీడియాతో మాట్లాడుతూ 'ఈ చిత్రానికి సెన్సార్ వాళ్లు కొన్ని కట్స్ చెప్పారు. మేము ఆ కట్స్ వద్దనుకున్నాం. సినిమాలో హీరోతోపాటు ఐదుగురు మహిళా క్యారెక్టర్లు బలంగా ఉంటాయి. 'విక్రమ్'లో కమల్ హాసన్ పాత్ర కథలో ఎలా ట్రావెల్ అవుతుందో అలా ఈ చిత్రంలోనూ ఉంటుంది. ఆర్చరీని కథలో చేర్చాలని చాలా సార్లు అనుకున్నాం. 'తమ్ముడు'లో కుదిరింది. ఆర్చరీ ట్రైనర్‌తో నితిన్‌కు 15 రోజులు శిక్షణ ఇప్పించాం. కథలో ప్రధానంగా బ్రదర్ సిస్టర్ సెంటిమెంట్ ఉన్నా అనేక కోణాల్లో మూవీ సాగుతుంది. 'కాంతారా' చూశాక సప్తమి గౌడ మా మూవీలోని క్యారెక్టర్‌కు బాగుంటుందని అనిపించి తీసుకున్నాం. మ్యూజిక్ డైరెక్టర్ అజనీష్ లోకనాథ్ మంచి బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ఇచ్చారు.

ఓ దినపత్రికలో వచ్చిన ఆర్టికల్ స్ఫూర్తితో 'తమ్ముడు' కథను సిద్ధం చేసుకున్నా. కథ విని దిల్‌రాజు గారు బడ్జెట్ గురించి ఆలోచించకుండా నిర్మించారు. ఈ కథకు సరిపోయే హీరో కోసం వెతికాం. నితిన్ బాగుంటాడని తీసుకున్నాం. లయ పాత్ర కోసం ఒకప్పటి స్టార్ హీరోయిన్‌కి కథ చెప్పాం. ఆమెకు కథ, క్యారెక్టర్ నచ్చింది. కానీ ఆమె వ్యక్తిగత కారణాల వల్ల నటించలేదు. అయితే మరోసారి ఇలాంటి క్యారెక్టర్ వస్తే తప్పకుండా నటిస్తానని చెప్పారు. నా ప్రతి సినిమా ఒక కొత్త జానర్‌లో ఉంటుంది. నేనెప్పుడూ జానర్ రిపీట్ చేయలేదు. నా స్క్రిప్ట్‌లో ఫిమేల్ క్యారెక్టర్లకు ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. ఇప్పటి దాకా అలా చేస్తూ వచ్చాను. తరవాత సినిమాకు ఎలా ఉంటుందో ఇప్పుడే చెప్పలేను' అని అన్నారు.

అల్లరి నరేశ్ 'ఆల్కహాల్'



హాస్య చిత్రాలతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకున్న అల్లరి నరేశ్, వైవిధ్యభరితమైన చిత్రాలతోనూ తనదైన ముద్ర వేస్తున్నారు. అదే కోవలో మరో వైవిధ్యమైన చిత్రంతో అలరించడం కోసం సీతార ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో చేతులు కలిపారు. 'ఫ్యామిలీ డ్రామా' ఫేమ్ మెహర్ తేజ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు 'అల్కహాల్' అనే టైటిల్ ఖరారు చేశారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ఫస్ట్‌లుక్ పోస్టర్ ఆకట్టుకుంటోంది. కాగా, అల్లరి నరేశ్ సరసన రుహాని శర్మ కథానాయికగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడించనున్నట్లు చిత్రబృందం పేర్కొంది.

సింగనపూడిలో సొసైటీ సభ్యుల ధర్నా



మండవల్లి జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగనపూడి గ్రామంలో లేబర్ కోఆపరేటివ్ సొసైటీ సభ్యులు నిర్వహిస్తున్న ధర్నా సోమవారం నాటికి మూడవ రోజుకు చేరుకుంది. కైకలూరుకు చెందిన పెత్తందారుడు మాదాసి కృష్ణప్రసాద్ లీజు సొమ్ము చెల్లించ కుండా ఇబ్బంది పెడుతున్నారని సొసైటీ సభ్యులు పేర్కొన్నారు. సొసైటీ భూములు తమకే కావాలంటూ చెరువు వద్ద నిరసన వ్యక్తం చేశారు.

పంచాయతీలకు నిధులు కేటాయించాలి



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న సర్పంచులు

ఏలూరు రూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పంచాయతీలకు నిధులు కేటాయించా లని డిమాండ్ చేస్తూ సోమవారం వైసీపీ పంచాయతీ రాజ్ విభాగం రాష్ట్రశాఖ పిలుపు మేరకు ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వికి కలిసి వినతిపత్రం అంద జేశారు. పలువురు నాయకులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కూటమి ప్రభుత్వం చట్టాన్ని తన చేతుల్లోకి తీసుకుని స్థానిక సంస్థలను నిర్వీర్యం చేస్తూ కేంద్రం విడుదల చేసిన నిధులను సైతం దారి మళ్లిస్తు స్థానిక ప్రజా ప్రతిని ధులను అగౌరవపరుస్తూ చట్టాలను తుంగలోకి తొక్కుతున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఫైనాన్స్ కమిషన్ నిధులు 1150 కోట్లు స్థానిక సంస్థలకు జమ చేయాలని విజ్ఞప్తి చేశారు. పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షులు షష్పాల గోపి, పెద్దిరెడ్డి రాము, కొటరాజు రాజా నాయన పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మహేశ్

కొల్లేరు సమస్య పరిష్కారానికి కృషి చేస్తా

అధికారులు అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తున్నారన్న ఎంపీ పుట్టా

కైకలూరు, జూన్ 30(ఆంధ్రజ్యోతి): కేంద్రసాధికార కమిటీ నివేదిక ప్రజలకు అనుకూలంగా ఉంటుందని ఆశిస్తున్నట్లు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ అన్నారు. కైకలూరు మండలం శృంగవరప్పాడులో సోమవారం కొల్లేరు ప్రజలతో నిర్వహించిన ప్రత్యేక సమావేశ ంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. కొల్లేరు ప్రజల సమస్యలపై నాకు పూర్తి అవగాహన ఉంది. కొల్లేరు సమస్య శాశ్వత పరిష్కారానికి నేను కృషి చేస్తాను. సమస్య సుప్రీంకోర్టు పరిధి లో ఉన్నందున కొంత సమయం పడుతుంది. శాశ్వత పరిష్కారం దిశగానే ప్రయత్నిస్తాను. స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్, మిగిలిన ఎమ్మెల్యేలు, ఎంపీలతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి మానవతా దృక్పథంతో కొల్లేరు సమస్యకు పరిష్కారం చూపమని కోరా. కొల్లేరులో పర్యటించిన కేంద్ర సాధికార కమిటీ ప్రతినిధులు సానుకూలంగా నివేదిక ఇస్తారని ఆశిస్తున్నా. కొంతమంది అటవీ శాఖ అధికారులు కొల్లేరు సమస్యలో అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తున్నారు. కొంత మంది ధనదాహంతో కొల్లేరు ప్రజలను ఇబ్బంది పెడుతున్నారు. వారి ఆటలు సాగకుండా కట్టడి చేస్తాం. ఇతర సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తా. కొల్లేరు ప్రజలకు ఎప్పుడూ అండగా కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు ఉంటాయి. త్వరలోనే మంచి శుభవార్త వింటారు' అని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠలరావు, ఎంపీపీ అడవి కృష్ణ, రాష్ట్ర దేవలరైతుల సంఘం అధ్యక్షుడు తాడినాడ బాబు, కొల్లేరు వడ్డిసాధికార సమితి కన్వీనర్ జలే ఏసురాజు పాల్గొన్నారు. అనంతరం కొల్లేటికోట పెద్దింటి అమ్మవారిని ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ దర్శించుకుని ప్రత్యేక పూజలను నిర్వహించారు.

పోలీస్ సిబ్బంది కుటుంబాలకు చేయూత



చెక్కులు అందిస్తున్న ఎస్పీ కేపీఎస్ కిశోర్

ఏలూరు క్రైం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): పోలీస్ శాఖలో పనిచేస్తు అనారోగ్యంతో మృతి చెందిన సిబ్బందికి పోలీస్ సంక్షేమంలో భాగంగా వారి కుటుంబ సభ్యులకు నగదు చెక్కులను ఏలూరు జిల్లా ఎస్పీ కెపిఎస్ కిషోర్ సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో అందించారు. జిల్లా పోలీస్ శాఖలో పనిచేస్తు అనారోగ్యంతో మరణించిన కానిస్టేబుల్ మధు కుమార్‌కి డీసీఫ్ వెల్ఫేర్ ఫండ్ నుంచి వచ్చిన చెక్కును మధుకుమార్ సతీమణి ఎం.దుర్గాదేవికి అందించారు. ఏఆర్ఎస్‌ఐ శ్రీను కొండలరావు అనారోగ్యంతో మరణించడంతో ఆయన సతీమణి సుమిత్ర రామలక్ష్మికి చెక్కును అందించారు. అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు, ఏఆర్ డీఎస్పీ బి.చంద్రశేఖర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరావు, డీపీఆర్వ ఇన్‌స్పెక్టర్ ఆదిత్ బాబు పాల్గొన్నారు.

గోదావరిలో మునిసిపల్ కాంట్రాక్టు సిబ్బంది జలదీక్ష



నరసాపురం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం సమ్మె బాట పట్టిన మునిసిపల్ కాంట్రాక్టు సిబ్బంది సోమవారం జల దీక్ష చేపట్టారు. వలందర్ రేవులో గోదావరి లో దిగి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ భద్రత, పనికితగ్గ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం మునిసిపల్ కార్యాలయం వద్ద రిలే దీక్షలు కొనసాగించారు. వీరి ఆందోళనకు పలు కార్మిక సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. రత్నం, కాశీ, సుజాత, కల్యాణి, పతి, శ్యాం, ఐత్తుల శ్రీను, సత్యనారాయణ, కిషోర్‌లు పాల్గొన్నారు.

సహకారంలో చోటెవరికి?



సహకార సంఘాలు.. గ్రామస్థాయిలో వీటి పాత్ర అత్యంత కీలకం. ప్రత్యేకించి రైతులంతా ఈ సంఘాలతోనే ముడిపడి ఉంటారు. ఏడాదికి రెండు పంటలు వేయాలన్నా ఈ సంఘాల నుంచి వచ్చే పరపతే పెద్ద దిక్కు. వైసీపీ సహకార వ్యవస్థను నిర్వీర్యం చేసింది.. అరేళ్లుగా సొసైటీలకు ఎన్నికలే లేవు.. కమిటీలతోనే కాలక్షేపం చేసింది.. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది కావడంతో స్థానికంగా ఒత్తిడి పెరుగుతోంది.. సొసైటీలకు త్రిసభ్య కమిటీలు ఏర్పాటు చేసే దిశగా కసరత్తు జరుగుతోంది.

- ఈ వారంలోనే సొసైటీలకు త్రిసభ్య కమిటీలు ?
- కూటమిలో చాన్నాళ్ల నుంచి ఎదురుచూపులు
- ఏడాది కాలం గడిచినా జాప్యమెందుకు
- క్షేత్రస్థాయిలో పెరుగుతూ వస్తున్న ఒత్తిడి
- ఇప్పటికే మూలనపడ్డ సహకార వ్యవస్థ

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

2019 నాటి వరకు సహకార సంఘాలకు ఎన్నికలు జరిగాయి. ఈ సంఘాల్లో సభ్యులు తమకు నచ్చిన వారిని పాలకవర్గంగా ఎన్నుకునే వారు. ప్రతీ గ్రామంలోనూ సొసైటీ డైరెక్టర్లు ఉండేవారు. వారి సిఫార్సు లతో కొందరు రైతులు రుణాలు పొందేవారు. అరేళ్లుగా సహకార వ్యవస్థ క్రమేపీ బలహీనపడుతూ వచ్చింది. జగన్ హయాంలో సొసైటీ పాలక వర్గాలకు ఎన్నికలు నిర్వహించేందుకే వెనుకాడారు. తమకు అనుకూలురుతో ప్రతీ సొసైటీకి త్రిసభ్య కమిటీని నియమించారు. ఇంకేముంది సొసైటీ యంత్రాంగం ఫ్యాన్ కింద కొలువైంది. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా సొసైటీలు ఇంకా ఊపిరి పీల్చుకోలేదు. ఏడాది పాలన పూర్తైనా స్పెషలాఫీసర్ల పాలనే సొసైటీల మీద పెత్తనం సాగిస్తున్నారు. ఇప్పటికే రెండు విడతలుగా అరేసి నెలలు పాటు వీరి పాలన సాగుతూ వచ్చింది. అయితే సొసైటీలకు త్రిసభ్య కమిటీలను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించి చాలాకాలమైంది. ఈ కమిటీలను పూర్తిచేస్తే కొంతలోకొంత పార్టీకి ఉత్తేజం వస్తుందని రైతులకు మరింత చేరువతామని ఎమ్మెల్యేలు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు.

ఎన్నాళ్లీ ఎదురుచూపులు ?

తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నామినేటెడ్ పదవులు వెల్లువెత్తుతాయని అందరూ ఊహించారు. కానీ ఏడాది వ్యవధిలో కొన్ని కీలక కార్పొరేషన్లకు మాత్రమే పాలకమండళ్లను నియమించారు. తమవంతు సహకార రంగానికి మరింత ఆక్సిజన్ ఇస్తూ ఆప్కాబ్ చైర్మన్‌గా గన్ని వీరాంజనేయులను నియమించారు. సహకార రంగం ఒక గాడినపెట్టే బాధ్యతను ఆయనకు అప్పగించారు. ఇదిలా ఉంటే సొసైటీలకు ఈమధ్య కాలంలో ఎన్నికలు నిర్వహించే అవకాశం లేకలేదు. స్పెషలాఫీసర్ల చేతుల మీదుగా ఇప్పటికే కార్యకలాపాలు పాలన చేస్తు న్నారు. కానీ దీనికి ప్రత్యామ్నాయంగా ఎన్నికలు జరిగేంత వరకు జగన్ హయాం మాదిరిగానే ప్రతీ సొసైటీకి త్రిసభ్య కమిటీని నియమించాలన్న ప్రతిపాదనకు ఇంతకుముందే ప్రభుత్వం సానుకూలత వ్యక్తం చేసింది. టీడీపీ, జనసేన, బీజేపీకి ఆయా సొసైటీల్లో త్రిసభ్య కమిటీల్లో భాగ స్వామ్యం కల్పించేదిశగా ఆదేశాలు కూడా వెలువడ్డాయి. ఇదంతా జరిగి ఆర్నెళ్లు కావస్తోంది. కానీ ఇప్పటి దాకా త్రిసభ్య కమిటీల జాడ ఎక్కడా కనిపించలేదు.

ముహూర్తమెప్పుడు ?

సొసైటీల త్రిసభ్య కమిటీలను నియమించే విషయంలో ముహూర్తం ఎప్పుడనేది అందరి లోనూ సస్పెన్స్‌గా మారింది. ఎప్పటికప్పుడు ఊరిస్తూనే వస్తున్నారు. కానీ క్షేత్రస్థాయిలో ఎమ్మెల్యేల సిఫార్సుల జాబితాలు చాలాచోట్ల ఉన్నతస్థాయికి పంపడం జరిగిందన్న అనుమానం ఉంది. అయితే సాధ్యమైనంత మేర జాబితా విడుదల చేయాలని ఒత్తిడి పెరుగుతోంది. దీంతో మొదటి వారంలోనే కొన్ని సహకార సంఘాలకు త్రిసభ్య కమిటీలను నేరుగా ప్రకటించబోతున్నారు. ఎక్కడా వివాదం లేని సొసైటీల్లోనే త్రిసభ్య కమిటీలను తొలి జాబితాను ప్రకటించా లని కీలక నిర్ణయం తీసుకున్నారు.జూలై మొదటి వారంలోనే అత్యధిక సొసైటీల త్రిసభ్య కమిటీలు ప్రకటిస్తారని సమా చారం. ఉమ్మడి పశ్చిమలో 20 నుంచి 30 సొసైటీల్లో ఒకింత వివాదం ఉండటంతో అవి మినహాయించి మిగతా కమిటీలను ప్రకటిస్తారని భావిస్తున్నారు.

ఉమ్మడి జిల్లా ప్రాతిపదికగా

ఉమ్మడి జిల్లా ప్రాతిపదికగా సొసైటీలకు త్రిసభ్య కమిటీలను వేయాలని కీలక నిర్ణయం తీసుకున్నారు. ఉమ్మడి జిల్లాలో 258 సహకార సంఘా లున్నాయి. విభజిత ఏలూరు 136, పశ్చిమ గోదావరిలో 122 సొసైటీలు న్నాయి. గడిచిన 90 రోజులుగా నియోజకవర్గాల వారీ అతిపెద్ద కసరత్తే జరిగింది. కొన్ని నియోజకవర్గాల్లో త్రిసభ్య కమిటీ జాబితాను ఒక కొలిక్కి తీసుకురావడం, ఎమ్మెల్యేలకు తలనొప్పిగానే మారింది. వింత లక్షాధి, కైకలూరు వంటి నియోజకవర్గాల్లో జాబితా తయారీలోనే ఒడిదు దుకులు తలెత్తాయి. స్థానిక నాయకులు సూచిస్తున్నదీ ఒకటే, ఎమ్మెల్యే ఆశిస్తుండని ఇంకోటి కావడంతో సుదీర్ఘ జాప్యమే జరిగింది. పోలవరం, ఉంగుటూరు, నర్సాపురం, భీమవరం, తాడేపల్లిగూడెం, నిడదవోలు నియోజ కవర్గాల్లో జనసేన ఎమ్మెల్యేల ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆయా నియోజకవర్గాల్లో త్రిసభ్య కమిటీ నియామకంలో ఎవరిది పైచేయి అనే విషయంలో ఒకింత తెలుగు గందరగోళం ఏర్పడినా, ఆ తదుపరి దిద్దుబాటు చర్యలకు దిగారు. తెలుగుదేశం, జనసేనకు కమిటీల్లో కొన్నిచోట్ల ప్రాతినిధ్యం కల్పించిన, బీజేపీ విషయానికొచ్చేసరికి మాత్రం ఒకింత గ్యాప్ కనిపించింది. ఈ విషయంలో బీజేపీ నాయకత్వం కూడా కమిటీల్లో తమ పార్టీకి చెందిన వారిని సిఫార్సు చేయడంలో తడబాటు చూపింది. కొన్ని చోట్ల స్థానిక బీజేపీ నాయకులు చొరవ తీసుకుని ఆయా నియోజక వర్గ ఎమ్మెల్యేలకు తమ వారి ప్రాతినిధ్యంపై జాబితాలను కూడా ఇచ్చారు.

మంత్రుల నియోజకవర్గాల్లో

మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్న పాలకొల్లు, నూజివీడు, నిడదవోలు నియోజకవర్గాల్లో త్రిసభ్య కమిటీల జాబితాలు రూపొందించడంలో ఎక్కడి కక్కడ అభిప్రాయాలకే విలువిచ్చారు. దీనికి సంబంధించి ఎక్కడ వివాదం లేకుండా జాగ్రత్త పడ్డారు. అన్నింటికంటే నామినేటెడ్ వ్యవహారంలో శాతం ప్రాతిపదికన నియామకాలు జరగాలన్న సూత్రాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. అయితే కొన్ని సొసైటీల్లో మేం గొప్పంటే. మేమే గొప్పని టీడీపీ, జనసేనల మధ్య ఒకింత పోటీ వాతావరణం లేకపోలేదు. సాధ్యమైనంత మేర స్థానిక కేడర్‌ను ఒప్పించి, మెప్పించి తుది జాబితా రూపకల్పనకు ప్రయత్నించారు. దీంతో మంత్రుల నియోజకవర్గాల్లో ఎలాంటి అవాంతరం లేకపోవడంతో లైన్ క్లియర్ అయ్యిందని చెబుతున్నారు.



నూతనంగా ఎన్నికైన రవికుమార్, ధనరాజులను అభినందిస్తున్న గన్ని, వలవల బాబ్జి

అభివృద్ధిపై చర్చకు ఎప్పుడైనా సిద్ధం

ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు

తాడేపల్లిగూడెం రూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గతంలో టీడీపీ హయాంలో చేసిన అభివృద్ధి, ప్రస్తుతం కూటమి చేస్తున్న అభివృద్ధిపై ప్రతిపక్ష నాయకులు చేస్తున్న విమర్శలను నిరూపించుకునేందుకు తాము ఎక్కడ చర్చకైనా సిద్ధమని ఆప్కాబ్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ గన్ని వీరాంజనేయులు సవాల్ విసిరారు. తాడేపల్లిగూడెం మండల టీడీపీ నూతన పాలకవర్గం ఎన్నిక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గతంలో మాజీ మంత్రి పైడికొండల మాణిక్యాలరావు, జడ్పీ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు, అప్పటి మున్సిపల్ చైర్మన్ బొలిశెట్టి శ్రీనివాస్ చేసిన అభివృద్ధిని, గత వైసీపీలో తాడేపల్లిగూడెంలో జరిగిన అభివృద్ధిని చర్చిద్దామన్నారు. మరో ముఖ్య అతిథి భవన నిర్మాణ, ఇతర కార్మిక బోర్డు చైర్మన్ వలవల బాబ్జి మాట్లాడుతూ ప్రజలు అభివృద్ధి కోరుకున్నారని అరాచకం వద్దని కూటమికి సంపూర్ణ విజయం అందించారని వారికి సేవ చేసేందుకే ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ప్రతిపక్షంలో ఉండగా పార్టీ కోసం పనిచేసిన మండల అధ్యక్షుడు పరిమి రవి కుమార్, ధనరాజులకు సముచిత స్థానం అందించిందన్నారు.

నూతన అధ్యక్షుడిగా పరిమి రవికుమార్

తాడేపల్లిగూడెం మండల పార్టీ అధ్యక్షుడిగా పరిమి రవి కుమార్‌ను రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కమిటీలో క్రియాశీలకంగా పనిచేసిన మద్దుకూరి ధనరాజును ప్రధాన కార్య దర్శిగా ఎన్నుకున్నారు. నియోజకవర్గ పరిశీలకులు నక్కా చిట్టిబాబు, టైల్డ్ ఫెడరేషన్ చైర్మన్ ఆకాశపు స్వామి, గంధం సతీష్, తెలుగు యువత అధ్యక్షుడు వనమద్ది రామ్‌లక్ష్మణ్, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు పాతూరి రాంప్రసాద్ చౌదరి పాల్గొన్నారు.

జాతీయ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు అర్బన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఉపాధ్యాయ అవార్డు- 2025కి జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు ఆన్‌లైన్ ద్వారా జూలై 15లోగా దరఖాస్తు చేసు కోవాలని డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. అందిన నామినేషన్లను నుంచి జిల్లా, రాష్ట్ర కమిటీల పరిశీలన అనంతరం పోర్టల్‌ను అయిన వారి అభ్యర్థుల వివరాలను ఆగస్టు 5, 6 తేదీల్లో వెబ్‌సైట్‌లో పొందు పరుస్తారని, ఇంటిపెండెంట్ జ్యూరీ తుది ఎంపికలు ఆగస్టు 13న జరుగుతాయని వివరించారు. కనీసం పదేళ్ల సర్వీసు వున్న రెగ్యులర్ ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్ మాత్రమే అవార్డుకు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని తెలిపారు.

డీఎస్సీ పరీక్షకు 15మంది గైర్హాజరు

ఏలూరు అర్బన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీ ఆన్‌లైన్ పరీక్షల్లో భాగంగా సోమవారం జరిగిన పరీక్షకు ఉదయం షిఫ్ట్‌లో 381 మంది అభ్యర్థులకు గాను 366 మంది హాజరయ్యారు. మొత్తం 15 మంది గైర్హాజరయ్యారు.

వన్ టౌన్.. వన్ డెలివరీ!

ఇక ఉత్తరాలు వేగంగా బట్వాడా

ఏలూరు ఆర్ఆర్ పేట కేంద్రంగా ఐడీసీ సెంటర్ ప్రారంభం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

నగరంలో ఉత్తరాలను వేగంగా, మెరుగ్గా బట్వాడా చేయడానికి పోస్టల్ శాఖ ఇండిపెండెంట్ డెలివరీ సెంటర్ (ఐడీసీ) విధానాన్ని ఏలూరు ఆర్ఆర్‌పేట బ్రాంచి పోస్టాఫీస్ (పిన్ కోడ్ 534001) నుంచి సోమవారం ప్రారంభించారు. తాజాగా 'వన్‌టౌన్‌.. వన్‌ డెలివరీ' విధానం కింద దేశవ్యాప్తంగా 638 పోస్టాఫీసుల పరిధిలో ఐడీసీ విధానాన్ని అమలు చెబ్తారు. విజయవాడ సర్కిల్ పరిధిలో ఏలూరు, విజయవాడ, గుడివాడ, మచిలీపట్నం గుంటూరు కేంద్రాల్లో ఉత్తరాలను ఒకే కేంద్రం నుంచి బట్వాడాకు శ్రీకారం చు ట్టారు. ఏలూరులో ఈ విధానాన్ని జిల్లా సూపరిం టెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్ ఎస్.శ్రీకరబాబు, ఐడీసీ ఇన్‌ఛార్జి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఉత్తరాల బట్వాడాకు బైకులపై పోస్ట్ వెసులుబాటు కల్పించారు. సిబ్బందికి పెట్రోల్ వ్యయాన్ని అందివ్వ నున్నారు. జిల్లాలో మొత్తం 33 పోస్టాఫీసులుండగా, జిల్లా కేంద్రమైన ఏలూరులో ఒక హెడ్ డెలివరీ కేంద్రాలు, ఒక ప్రధాన పోస్టాఫీస్ (వన్‌టౌన్‌లో) ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా ఇప్పన్ని రెగ్యులర్ సేవలకే పరిమితమవుతాయి. అక్కడ నుంచి ఉత్తరాల బట్వాడా ఉంటుంది.

ఆలస్యానికి ఫుల్‌స్టాప్

ఏలూరు నుంచి ప్రతిరోజు 3,300లకు పైబడి ఉత్తరాలతో పాటు, స్పీడ్‌పోస్టు, కార్లో తదితర సేవల రూపంలో పార్సిల్స్ బట్వాడా జరుగుతుంటాయి. డొమెస్టిక్ కార్గో సేవలతో పాటు కమర్షియల్ నోటీసులు, లీగల్ నోటీసులు, గవర్నమెంట్ ఇతర నోటీసులను పంపిణీ పూర్తి చేస్తారు. వాస్తవంగా గతంలో ఒక సెంటర్‌కు వెలుపల సెంటర్ ఉత్తరాలు వస్తే పోస్టుమెన్ పని గట్టుకుని తీసుకెళ్లి ఆ సెంటర్‌లో ఇవాల్సి వచ్చేది. దీనివల్ల ఒక రోజు పైబడి జాప్యం జరిగేది. ఇప్పుడలా కాకుండా ఏలూరు నగరానికి సంబంధించి చుట్టుప క్కల కలుపుకుని మొత్తం 33 మంది పోస్టల్ సిబ్బంది ఆర్ఆర్‌పేట కేంద్రంగా పనిచేస్తారు. రోజువారీ ఉత్తరాలు, స్పీడ్‌పోస్టులు, ఇతర నోటీసులు, బిజినెస్ కార్డులను ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంట ల్లోగా వేగంగా బట్వాడా పూర్తి చేయనున్నారు. అడ్రస్ లు మారి, ఇతరత్రా సమస్యలను ఒకచోట నుంచి పరిష్కరిస్తూ పోస్టుమెన్ ద్వారా అక్కడికక్కడే పరిష్కారం చూపనున్నారు. ఐడీసీ సేవల్లో ఏమైనా ఇబ్బందులుంటే ఈ కేంద్రం ఇన్‌ఛార్జి శ్రీనివాసరావును 94401 87952 ను సంప్రదించవచ్చని జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్ శ్రీకరబాబు తెలిపారు. ఐడీసీ విధానాన్ని దశలవారీగా అన్ని పట్టణాల్లో విస్తరించనున్నట్లు తెలిపారు.



ఐడీసీ కేంద్రం ప్రారంభిస్తున్న జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్ శ్రీకరబాబు

చికిత్స పొందుతూ వివాహిత మృతి



మోహనమ్మ (ఫైల్)

ఏలూరు క్రైం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యాయత్నం చేసి కాలిన గాయాలతో విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న వివాహిత సోమవారం మృతి చెందింది. ఏలూరు బీడీ కాలనీలోని వృద్ధాశ్రమం నిర్వహించే సోమేశ్వరరావు అదే ఆశ్రమంలో ఆశ్రయం పొందుతున్న లావేటి మోహనమ్మ (38)ను గత ఏడాది ఆగస్టులో వివాహం చేసుకున్నాడు. వీరి మధ్య మనస్పర్థలు రావడంతో ఆమె ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో జూన్ 24న కేసు నమోదు చేశారు. భర్త సోమేశ్వరరావుకు 41ఏ నోటీసు కూడా ఇచ్చారు. అయితే తన భర్తను అరెస్టు చేసి జైలులో పెట్టాలని ఆమె పోలీసులను డిమాండ్ చేసింది. వారు భార్యాభర్తలిద్దరికీ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ నెల 26న జిల్లా జైలు సమీపంలో తనపై పెట్రోలు పోసుకుని మోహనమ్మ ఆత్మహత్యాయత్నం చేసింది. గాయపడిన ఆమెను తొలుత ఏలూరు ప్రభుత్వాసుపత్రికి అనంతరం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. ఏలూరు వన్‌టౌన్ సీఐ జి.సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మోహనమ్మ మృత దేహానికి మంగళవారం ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించనున్నారు.

మోటారు సైకిల్ అదుపు తప్పి గాయాలు

ఆచంట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఆచంట నుంచి ద్విచక్రవాహనంపై ఇద్దరు వ్యక్తులు సోమవారం వల్లూరు వెళుతుండగా ఆచంట జగ్గరాజు కాలువ సమీపంలో వీరు ఒక స్కూటీని తప్పించబోయి బైక్ అదుపుతప్పి బోల్తా పడటంతో వెనుకసైపు కూర్చున్న వల్లూరుకు చెందిన గుబ్బల బాలాజీ తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించడంతో వారు హెల్త్ సెంటర్‌లో ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం నిమిత్తం తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వ్యాన్ ఢీకొని ఒకరికి గాయాలు

మొగల్తూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): వ్యాన్ ఢీకొనడంతో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. యలమంచిలికి చెందిన అబ్బన హేమంత్ అనే వ్యక్తి కాళీపట్నం నుంచి యలమంచిలి బైక్‌పై వెళుతుండగా మొగల్తూరులోని 216 జాతీయ రహదారి పక్కలవారిళ్లైటు జంక్షన్ వద్ద ఎదురుగా వస్తున్న వ్యాన్ ఢీకొని తీవ్ర గాయాల పాలయ్యాడు. నరసాపురం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మొగల్తూరు పోలీసులు తెలిపారు.

లారీ ఢీకొని ఒకరి దుర్మరణం


పాలకోడేరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొన్న ప్రమాదంలో పాలకోడేరు ఆశా వర్కర్ భర్త ఆవాల వెంకటేశ్వరరావు (35) మృతి చెందాడు. పాలకోడేరుకు చెందిన వెంకటేశ్వరరావు ఆటో నడుపుతూ జీవిస్తున్నాడు. సోమవారం రాత్రి బైక్‌పై గొల్లలకోడేరు నుంచి పాలకోడేరు వైపు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఇసుక లోడు లారీ అతనిని ఢీకొని తలపై నుంచి వెళ్లిపోవడంతో అతను అక్కడిక క్కడే మృతి చెందాడు. వెంకటేశ్వరరావు మృతితో గ్రామానికి చెందిన ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది, గ్రామస్తులు కన్నీరుమున్నీరయ్యారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాతా శిశు మరణాలపై వైద్యాధికారులు ఆరా

భీమవరం టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మాతా, శిశు మరణాల సబ్ కమిటీ అంతర్గత సమీక్ష సమావేశం డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ జి.గీతా బాయి అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ త్రైమాసికంలో జరిగిన ఒక మాతృ మరణం, ఐదేళ్లలోపు (0-5) 15 శిశు మరణాల కారణాలపై సంబంధిత వైద్యాధికారులు, పర్యవేక్షకులు, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలతో సమగ్ర విశ్లేషణ జరిపి కారణాలు అడిగి తెలుసుకు న్నారు. మరణాల సంఖ్య తగ్గించడానికి తీసుకో వలసిన చర్యలపై చర్చించారు. సమావేశంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ దేవ సుధా లక్ష్మి, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ సూర్యనారాయణ, గర్భకోశ వ్యాధుల నిపుణులు డాక్టర్ నవీన్, డాక్టర్ లక్ష్మి, చిన్న పిల్లల వ్యాధి నిపుణులు డాక్టర్ ప్రవీణ్, మహిళా శిశు సంక్షేమ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీ లక్ష్మి, మత్తు వైద్యులు డాక్టర్ స్వర్ణలత, డాక్టర్ పద్మ, వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కేసులు సత్వరం పరిష్కరించండి

ఏలూరు క్రైం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఉచిత న్యాయ సహాయం ద్వారా అందించే కేసులు త్వరితగతిన పరిష్కరించాలని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె రత్న ప్రసాద్ సూచించారు. ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలోని డీఎల్ఎస్ఏ భవనంలో ప్యానెల్ న్యాయవాదులతో సమీక్ష సమావేశాన్ని డీఎల్ఎస్ఏ కార్యదర్శి రత్న ప్రసాద్ నిర్వహించారు. ఈ సందర్భంగా కక్షిదారులకు ఉచితంగా వాదించే కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలై 5న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో న్యాయవాదులు కక్షిదారులకు కౌన్సెలింగ్ నిర్వహించి కేసుల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ప్యానెల్ న్యాయవాదులు న్యాయసేవాధికార సంస్థ నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొని కక్షిదారులకు న్యాయసేవలు మరింత చేరువయ్యేందుకు కృషి చేయాలని సూచించారు. చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పీఎస్ఎం మునేశ్వర, ప్యానెల్ న్యాయవాదులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి రత్న ప్రసాద్

పోలీసులకు రివార్డులు

నరసాపురం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): నరసాపురం రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొత్త నవరసపురం గ్రామంలో కోడి పందేలపై దాడి చేసి జూదరులను పట్టుకున్న 17 మంది పోలీసులకు నగదు రివార్డులను సోమవారం న్యాయమూర్తి రాజ్యలక్ష్మి ప్రకటించారు. గత ఏడాది డిసెంబర్‌లో కోడి పందేలపై పోలీసులు దాడి చేసి 23 పుంజులు, రూ. 3.30లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. 8 కత్తులు, 28 మోటార్ సైకిళ్లు, 17 ఫోన్లను స్వాధీనం చేసు కున్నారు. పుంజులను వేలం వేయగా రూ. 5 లక్షల ఆదాయం వచ్చింది. పోలీసులు నైపుణ్యంతో పని చేసినట్టు గుర్తించిన న్యాయమూర్తి వారిని అభినందిస్తూ రూ.72,480 నగదు బహుమతి ప్రకటించారు. సీఐ జి. శ్రీనివాసరావు, దుర్గాప్రసాద్, ఎస్ఐలు గురవయ్య, నాగలక్ష్మి, సురేంద్రకుమార్, ఏఎస్ఐలు కేవీ సత్యనారాయణ, బాస్కరరావు, హెడ్ కానిస్టేబుల్ ఎస్. శ్రీనివాసరావు, కానిస్టేబుళ్లు వి. బాలాజీ, కాటం రాజు, బాపూజీ, రామకృష్ణ, నరేంద్ర, చిన్న బాబు, జి. శ్రీనివాస్, నాగదుర్గ కుమార్, బి. ఉమామహేశ్వరావు రివార్డుకు ఎంపికయ్యారు.

దాడి ఘటనపై కేసు నమోదు

టీ.నర్సాపురం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఒకరిపై దాడి చేసిన ఆరుగురిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై ఎం.జయబాబు తెలిపారు. బొర్రంపాలెంకి చెందిన తలపర్తి చంద్రశేఖర్ స్థలాన్ని అదే గ్రామానికి చెందిన రెళ్ల జ్ఞానరాజు ఆక్రమించుకుంటూ రెండేళ్ల క్రితం కోర్టు నుంచి ఇంజక్షన్ ఆర్డర్ తెచ్చుకున్నారు. ఈ నేపథ్యంలో జూన్ 28న చంద్రశేఖర్ తన స్థలం లో తోలిన మట్టిని జ్ఞానరాజుతోపాటు ఆరుగురు వ్యక్తులు మట్టిని తీసుకున్నారు. కోర్టు కేసులో ఉన్న స్థలంలో మట్టిని ఎందుకు తీసుకున్నారని అడుగగా కర్రతో కొట్టి గాయపరచడంతో కుటుంబసభ్యులు చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చగా ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

దోమలు పుట్టుకకు చెక్ పెట్టాలి

తణుకు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సబ్ యూనిట్ అధికారి జి. వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం పట్టణంలోని 14, 29వార్డులలో పరిశీలన చేశారు. రోజులు తరబడి మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. దోమలు పుట్టుకకు చెక్ పెట్టాలని అన్నారు. అనంతరం పలు గృహాలను సందర్శించారు. అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పైలేరియా కంట్రోల్ యూనిట్ సూపర్‌వైజర్ సత్యనారాయణ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద విద్యార్థుల ధర్నా

పెనుమంట్ర, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : మా బడి మాకు కావాలి .. మా మాస్టర్ మాకు కావాలి అంటూ పెనుమంట్ర మండలం సూర్యారావు పేట ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, గ్రామస్థులు సోమవారం భీమవరం జిల్లా కలెక్టరేట్ వద్ద ఆందోళన చేశారు. దూరంగా ఉన్న పాఠశాలలో తమ పాఠశాలను విలీనం చేయడం సరికాదని విద్యార్థులు పేర్కొన్నారు. వీరి ఆందోళనకు దళిత సంఘ నాయకులు మద్దతు తెలిపారు.

లయన్స్ క్లబ్ కార్యవర్గం ప్రమాణ స్వీకారం

పాలకొల్లు అర్బన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పాలకొల్లు లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం ఆదివారం రాత్రి లయన్స్‌క్లబ్ హాల్లో ప్రెసిడెంట్ డాక్టర్ జయభారత రెడ్డి అధ్యక్షతన జరిగింది. నూతన అధ్యక్షుడిగా శిడగం శ్రీనివాసరావు(సతీష్) కార్యదర్శిగా డీవీవీ సత్యనారాయణ ప్రసాద్, కోశాధికారిగా డీఎల్‌వీ ప్రసాద్‌ల చేత పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎంఎస్ఎస్ శర్మ ప్రమాణ స్వీకారం చేయించారు. జిల్లా కేబినెట్ కార్యదర్శిగా ముచ్చర్ల వెంకట సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సీహెచ్ సత్యనారాయణమూర్తి (బాబ్జీ), డిస్ట్రిక్ట్ గవర్నర్ (ఎలక్ట్) ఎన్‌వీఎస్ పాపారావు నాయుడు, అరుణ, శిఖాకొల్లు కామేశ్వరరావు పాల్గొన్నారు.

మునిసిపల్ కాంట్రాక్ట్ కార్మికుల ఆందోళన

పాలకొల్లు అర్బన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మునిసి పాలిటి పరిధిలో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం మునిసిపల్ కార్యాలయం వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో మునిసిపల్ ఉద్యోగ సంఘాల నాయకులు మద్దతు పలికారు. ఈ సందర్భంగా శిబిరం వద్ద ఫిట్టర్ రాజు, నాయకులు కార్మికులు న్యాయమైన కోర్కెలు ప్రభుత్వం సానుభూతితో పరిష్కరించాలని కోరారు.

తాడేపల్లిగూడెం: మున్సిపల్ ఇంజనీరింగ్ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యను తక్షణ మే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు కర్రి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మున్సిపల్ ఇంజనీరింగ్ కాంట్రాక్టు కాంట్రాక్టు కార్మికులు సమ్మెను సోమవారం ఉధృతం చేశారు. విధులకు పూర్తిస్థాయిలో హాజరు కాలేదు. ఇంతవరకు పాక్షికంగా విధులకు హాజరవుతూ ఆందోళన చేశారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట దీక్షకొనసాగించారు. ఈ శిబిరాన్ని సీఐటీయూ జిల్లా నాయకుడు కర్రి నాగేశ్వరరావు సందర్శించి కార్మికులకు మద్దతు తెలిపారు. సోమవారం సాయంత్రం మున్సిపల్ వాటర్ వర్క్స్ విభాగంలో బయట కార్మికులతో పనిచేయడంతో కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులు వాటర్‌వర్క్స్ విభాగం వద్దకు చేరి ఆందోళన చేశారు. పోలీస్‌లు మోహరించి ఆందోళన కారులను చెదరగొట్టారు.

స్టాటిస్టిక్స్‌కు ఎంతో ప్రాధాన్యం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ లక్ష్మీసుందరీబాయ్

తణుకు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మానవ జీవితంలో స్టాటిస్టిక్స్ ఎంతో ప్రాముఖ్యత ఉందని ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ యు. లక్ష్మీసుందరీబాయ్ అన్నారు. సోమవారం కళాశాలలో జాతీయ సంఖ్యాక శాస్త్ర దినోత్సవం సందర్భంగా జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ దేశాభివృద్ధికి సంబంధించిన అంశాలను అంచనా వేయడంలో ప్రముఖ పాత్ర వహిస్తుందని చెప్పారు. స్టాటిస్టిక్స్ అధ్యాపకులు సి.హెచ్.నాగరాజు పాల్గొన్నారు.

డాక్టర్ వత్సవాయికి అవార్డు



తణుకు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): సేవా రంగంలో తణుకు రొటేరియన్ డాక్టర్ వత్సవాయి వెంకటేశ్వరావు అవార్డు అందుకున్నారు. రాజమహేంద్రవరంలో రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ సభలో అవార్డులు అందజేశారు. ఇందులో భాగంగా తణుకు పట్టణానికి చెందిన పిల్లల వైద్యులు డాక్టర్ వెంకటేశ్వరావు రోటరీ గవర్నర్ చేతులు మీదుగా వ్యక్తిగత వొకేషనల్ అవార్డు అందుకున్నారు.

మునిసిపల్ గ్రీవెన్స్‌లో 10 ఫిర్యాదులు

తాడేపల్లిగూడెం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 10 ఫిర్యాదులు అందినట్టు మున్సిపల్ కమిషనర్ ఏసుబాబు తెలిపారు. టిడ్కో ఇళ్లు, పబ్లిక్ హెల్త్, పెన్షన్‌లకు సంబంధించిన సమస్యలు ఉన్నాయి.

జీరో అడ్మిషన్స్

(5వ పేజీ తరువాయి)

పాఠశాలల్లో చేరారు. గతేడాది వరకు హైస్కూళ్లలోవున్న 3, 4, 5 తరగతులను పూర్వపు ప్రాథమిక పాఠశాలలకు తిరిగి వెనక్కి తెస్తూ ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు ఈ ఏడాది ఏర్పాటు చేసిన మోడల్ ప్రైమరీ స్కూళ్లు (ఎంపీఎస్) జిల్లాలో 254 ఈ నెల 12న ప్రారంభమైన విషయం విదితమే. అన్ని మౌలిక సదుపాయాలతో ఏర్పాటు చేయతలపెట్టిన ఎంపీఎస్‌లలోనూ విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ ఆశించినంతగా లేదు. జిల్లాలోని ఎంపీఎస్‌లలో శనివారం వరకు జరిగిన ఎన్‌రోల్‌మెంట్‌ను పరిశీలిస్తే కేవలం 15-29 మంది విద్యార్థులతో 6 స్కూళ్లు, 30-44 మంది విద్యార్థులతో ఉన్నవి 60, 45-59 మందితోవున్న ఎంపీఎస్‌లు 93, 60-74 మంది బాలబాలికలతో 51 స్కూళ్లు ఉన్నాయి. మొత్తం మీద సంతృప్తికర కనీసస్థాయి అంటే 75 మందికిపైగా విద్యార్థులున్న మోడల్ ప్రైమరీ స్కూళ్లు కేవలం 17.3 శాతం మాత్రమేనని తేల్చారు. ఆ ప్రకారం జిల్లాలో 80.3 శాతం ఎంపీఎస్‌లు నిర్దేశించిన ఎన్‌రోల్‌మెంట్ ను చేరుకోవడంలో చాలా వెనుకబడి ఉన్నాయి. పశ్చిమ గోదావరి జిల్లాలో టాప్-3 మండలాల్లో పెనుమంట్ర, పెంటపాడు, వీరవాసరం ఉండగా, పోడూరు, యలమంచిలి, ఆచంట మండలాలు అట్టడుగున ఉన్నాయి.

రెండు శాఖల్లో భిన్నంగా

ఏలూరు జిల్లాలో ఐదేళ్లలోపు వయస్సువున్న చిన్నారులు గత విద్యా సంవత్సరంలో 13,939 మంది అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్య చదువుతున్నారు. నిబంధనల ప్రకారం వీరిని సమీప ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఒకటో తరగతిలో చేర్పించాల్సిన బాధ్యత అంగన్‌వాడీ టీచర్లదేనని వేసవి సెలవులకు ముందే ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. దీనికి భిన్నంగా పాఠశాలలు తెరిచిన తర్వాత అడ్మిషన్లను పరిశీలిస్తే ఈ నెల 16 నాటికి కేవలం 7,331 మంది చిన్నారులు మాత్రమే ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతి అడ్మిషన్లు తీసుకోగా, మిగతా 6,608 మంది ప్రైవేటు పాఠశాలల్లో చేరారని ఐసీడీఎస్ అధికారిక గణాంకాలు నిర్ధారించాయి. దీనికి భిన్నంగా విద్యా శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం జిల్లాలో 11,817 మంది పిల్లలను ఒకటో తరగతిలో ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పాల్సి ఉండగా, ఈ నెల 28 నాటికి కేవలం 6,368 మంది (54 శాతం)మాత్రమే చేరారు. దీంతో ఇపుడు ఒకటో తరగతిలో ఒక్కరూ కొత్తగా అడ్మిషన్ తీసుకునే వారు లేరని చెప్పవచ్చు. ఐదో తరగతి ఉత్తీర్ణులై ఆరో తరగతిలోకి చేరాల్సిన (ట్రాన్సిషన్) విద్యార్థులు 13,461 మంది ఉండగా, వీరిలో 9,054 మంది (67.3 శాతం) మాత్రమే అడ్మిషన్లు తీసుకున్నారు. వేసవి సెలవుల్లోనే టీచర్ల సాధారణ బదిలీల కౌన్సెలింగ్ పూర్తి కావాల్సి ఉండగా, పలు కారణాలతో పాఠశాలలు తెరిచిన తర్వాత కొన్ని రోజులపాటు కొనసాగింది. ముఖ్యంగా ప్రాథమిక విద్యను బోధించే ఎస్జీటీలకు బదిలీలు పూర్తయ్యే నాటికి దాదాపు ప్రైవేటు పాఠశాలల వైపు ఒకటో తరగతి విద్యార్థుల అడ్మిషన్లు జరిగిపోయాయని తెలుస్తోంది. ఫలితంగా బదిలీల అనంతరం నూతన స్థానాల్లో చేరిన టీచర్లు ఆవాస ప్రాంతాల్లో అడ్మిషన్ల కోసం ప్రయత్నాలు చేసినా ఫలితం లేకుండా పోయింది.

ఏలూరు జిల్లాలో జీరో అడ్మిషన్ స్కూల్స్

ఏలూరు జిల్లాలోని ప్రాథమిక పాఠశాలల్లో ఈ ఏడాది కొత్తగా ఒకటో తరగతిలోకి ఒక్క విద్యార్థి కూడా అడ్మిషన్ తీసుకోని జీరో ఎన్‌రోల్‌మెంట్ స్కూళ్లు 131 ఉండటం కలవరపెడుతోంది. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ఐదులోపు బాల బాలికలున్న స్కూళ్లు 120, మోడల్ ప్రైమరీ స్కూళ్లలో నిర్దేశిత 60 మంది విద్యార్థులు కూడా లేనివి 137 ఉండటం గమనార్హం. మొత్తం ఎంపీఎస్‌ల్లో 15-29 ఎన్‌రోల్‌మెంట్‌తో మూడు స్కూళ్లు, 30-44 మందితో 49, 45-59 ఎన్‌రోల్‌మెంట్‌తో 97, 60-74 మందితో 105 స్కూళ్లు ఉన్నట్టు నిర్ధారించారు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ఒక్క విద్యార్థి కూడా లేని జీరో ఎన్‌రోల్‌మెంట్ స్కూళ్లు 19 ఉండటం సర్వత్రా ఆందోళనకు గురిచేస్తోంది.

లో ఓల్టేజ్‌కు చెక్

(5వ పేజీ తరువాయి)

నియోజకవర్గాల పరిధిలోని మండలాలకు, నరసాపురం సబ్‌స్టేషన్ పరిధిలోని 130 టు కేవీ సబ్‌స్టేషన్ ఉంది. దీనికి ఉండి సబ్‌స్టేషన్ నుంచి భీమవరం మీదుగా సరఫరా జరుగుతోంది. ఇదే లైన్‌లో మరో 90 మెగావాట్స్ విద్యుత్ లైన్ నరసాపురం సబ్‌స్టేషన్ మీదుగా రాజోలు వెళుతుంది. ప్రస్తుతం ఒకలైన్ నుంచి 90 మెగావాట్స్ మాత్రమే సరఫరా తీసుకుంటున్నారు. తాజాగా రాజోలు వెళ్లే లైన్‌ను లైన్ ఇన్, లైన్ అవుట్ పద్ధతిలో నరసాపురం సబ్‌స్టేషన్‌కు అనుసంధానం చేస్తున్నారు. దీనివల్ల 180 మెగావాట్స్ విద్యుత్ నరసాపురం సబ్‌స్టేషన్‌కు అందుతుంది. దీన్ని రెండు నియోజకవర్గాలకు పుష్కలంగా సరఫరా చేయవచ్చు. మిగిలినది రాజోలుకు వెళుతుంది. ఇప్పటికే అమలాపురం గుండా మరోలైన్ ద్వారా విద్యుత్ సరఫరా వస్తుంది.







భీమవరంలో రిటైర్డ్ పోలీసులకు సత్కారం.. భీమవరంలో ఆర్టీసీ డీఎం సత్యనారాయణ మూర్తికి ఎమ్మెల్యే రామాంజనేయులు సత్కారం.. పెంటపాడులో ఎంపీడీవో బాలాజీని సత్కరిస్తున్న గ్రామస్థులు

రిటైర్డ్ ఉద్యోగులకు ఘన సత్కారం



సరిపల్లిలో రిటైర్డ్ ఉద్యోగి మోహన్‌రావును సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే మాధవ నాయుడు, గ్రామస్థులు

భీమవరం క్రైం/ఆకివీడు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలో పోలీసు శాఖ ద్వారా ప్రజలకు విశిష్ట సేవలందించి సోమవారం ఉద్యోగ విరమణ చేసిన పోలీసు సిబ్బందిని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జిల్లా అదనపు ఎస్పీ వి.భీమారావు ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. కె.శ్రీనివాసరావు, హెడ్ కానిస్టేబుల్, 414, ఆకివీడు పోలీస్ స్టేషన్, ఎ.గంగారావు, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ 288 డ్రైవర్, సీహెచ్. శ్రీరామచంద్రమూర్తి, హోంగార్డు- 311, తాడేపల్లిగూడెం రూరల్ పోలీస్ స్టేషన్‌కు చెందినవారు ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు ఎస్పీ మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన ప్పటికీ మీరు పోలీసు కుటుంబ సభ్యులేనని, ఎలాంటి సమస్య ఉన్నా, ఎప్పుడైనా తమ దృష్టికి తెస్తే పరిశీలించి పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీ ఎంవీవీ సత్యనారాయణ, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ డి.వెంకటేశ్వరరావు, ఆర్మ్‌డ్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ కె.వెంకట్రావు, జిల్లా పోలీసు అసోసియేషన్ ప్రెసిడెంట్ సీహెచ్. మోజేష్ పాల్గొన్నారు.

ప్రజాసేవకు విరమణ లేదు

భీమవరం టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగానికి విరమణ ఉంటుంది తప్ప ప్రజా సేవకు విరమణ ఉండదని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం ఆర్టీసీ డిపో మేనేజర్ పీఎస్‌వీ సత్యనారాయణ మూర్తి ఉద్యోగ విరమణ కార్యక్రమంలో ఎమ్మెల్యే అంజిబాబు పాల్గొని మాట్లాడారు. ప్రతి ఉద్యోగి పదవి విరమణ అనంతరం తాను పని చేసిన సంస్థకు తమ అమూల్యమైన సూచనలు సలహాలు అందించాలని అన్నారు. ప్రతి ఉద్యోగి పదవి విరమణతో తమ జీవితం ఆగిపోయింది అను కోకుండా సంస్థకు సేవలందించాలని అన్నారు. అనంతరం సత్యనారాయణ మూర్తి దంపతులను సత్కరించారు. రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ వేగేశ్న కనకరాజు సూరి, యుకె విశ్వనాథరాజు, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

నరసాపురం రూరల్: సరిపల్లి పంచాయతీ గ్రామంలో ఉద్యోగ వీరమణ పొందిన సోడదాసి మోహన్ రావును గ్రామస్థులు, ఉద్యోగస్థులతో కలిసి మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఈదా సురేష్, సోడదాసి శ్రీధర్,మైలాబత్తుల ఉమా, జాన్ కెనడి, రేకపల్లి సురేష్, కొట్టు పండు, నడిపూడి కృష్ణ పాల్గొన్నారు.

ఎంపీడీవో బాలాజీ ఉద్యోగ విరమణ

పెంటపాడు, జూన్ 30(ఆంధ్రజ్యోతి) : ఎంపీడీవోగా, ఇన్‌చార్జి డీఎల్‌పీవోగా చీకట్ల బాలాజీ వెంకటరమణ చేసిన సేవలు అభినందనీయమని అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు కొనియాడారు. ఎంపిడీవో బాలాజీ పదవి విరమణ సత్కారాన్ని ఎంపీపీ దాసరి హైమావతి అధ్యక్షతననిర్వహించారు. కార్యక్రమంలో ఏపీడీ మల్లికార్జునరావు, టీడీపీ, జనసేన, బీజేపీ మండల అధ్యక్షులు కిలపర్తి వెంకట్రావు, పుల్లా బాబి, దత్తు ప్రసాద్, ఇన్‌చార్జి ఎంపీడీవో టీవీ.సత్యనారాయణ, తహసీల్దార్ రాజరాజేశ్వరి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పార్టీ పరిశీలకుడు నరసింహస్వామి

ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

గణపవరం, జూన్30 (ఆంధ్రజ్యోతి): గణపవరంలోని కన్యాకపరమేశ్వరి వర్తక సంఘ భవనంలో గణపవరం, నిడమర్రు టీడీపీ కార్యకర్తలు, బూత్‌కమిటీలు, మండల కమిటీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉంగుటూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ ఏవీపీ. నరసింహస్వామి మాట్లాడుతూ జూలై 2 నుంచి నిర్వహించనున్న సుపరిపాలన-తొలిగడప కార్యక్రమంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్, గణపవరం మండల టీడీపీ అధ్యక్షుడు ఇందుకూరి రామకృష్ణంరాజు, నిడమర్రు మండల టీడీపీ అధ్యక్షుడు ముత్యాల స్వామి, గణపవరం పట్టణ టీడీపీ అధ్యక్షుడు కూసంపూడి సురేంద్రకుమారరాజు పాల్గొన్నారు.

గణపవరం విద్యార్థులకు ర్యాంకులు

గణపవరం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గణపవరంలోని చింతలపాటి మూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ ఏడాది డిగ్రీపూర్తయిన విద్యార్థులు పీజీసెట్ పరీక్షల్లో జువాలజీ సబ్జక్టులో రాష్ట్ర స్థాయిలో 3వ ర్యాంకును కె.కృష్ణప్రియ సాధించిందని ప్రిన్సిపాల్ డాక్టర్ పి.నిర్మలకుమారి తెలిపారు. బోటనిలో రూపశ్రీ రాష్ట్ర స్థాయిలో 22వ ర్యాంకు, ఎస్.సంధ్యారాణి 70వ ర్యాంకు, కె.బహ్యాలహరి 74వ ర్యాంకు, బేబి శిరీష కెమెస్ట్రీలో 96వ ర్యాంకు సాధించారని తెలిపారు.

పరిష్కార వేదికలో రెండు ఫిర్యాదులు

మొగల్తూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో రెండు ఫిర్యాదుల అందినట్టు తహసీల్దార్ కె.రాజ్ కిషోర్ తెలిపారు. తమ భూములు సర్వే నిర్వహించి హద్దులు నిర్ధారించాలని ఇరువురు వ్యక్తులు దరఖాస్తు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో త్రిశూలపాణి, ఈవోఆర్డీ నవీన్ కిరణ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చెయ్యండి

భీమవరం టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకగా ఈనెల 9న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని, ఈనెల 2న జరిగే సీఐటీయూ జిల్లా విస్తృత సమావేశం జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జేఎన్వి గోపాలన్, కె రాజా రామ్మోహన్ రాయ్ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. సమ్మె విజయవంతం కోసం 3,4,5 తేదీల్లో జిల్లా అంతా జీపు యాత్ర, విస్తృత ప్రచారం, గ్రూప్ మీటింగులు తదితర కార్యక్రమాల నిర్వహణపై ఈ సమావేశంలో చర్చించబోతున్నట్లు వారు తెలిపారు.

లేబర్ కోడ్స్ రద్దు చేయాలి

పెంటపాడు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మిక చట్టాలను యథాతథంగా అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు, చిర్లా పుల్లారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ప్రత్తిపాడులో నిరసన తెలిపారు. కార్యక్రమానికి లంకలపల్లి అప్పారావు అధ్యక్షత వహించారు.

తాడేపల్లిగూడెం రూరల్: కేంద్ర ప్రభుత్వం తెచ్చి నాలుగు లేబర్ కోడ్‌లు వెంటనే రద్దు చేయాలని సీఐటీయు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. కూరగాయల మార్కెట్ వర్కర్స్ యూనియన్ సమావేశం పుచ్చలపల్లి సుందరయ్య బవనంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక హక్కులను నిరుగారుస్తున్నాయన్నారు.

పుస్తకాలు పంపిణీ

పాలకొల్లు టౌన్ , జూన్ 23(ఆంధ్రజ్యోతి): జీవీఎస్‌వీఆర్ఎం మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సోమవారం న్యాయవాది జయసరిత నోట్ పుస్తకాలు, పెన్నులు, విద్యాసామగ్రి, బిస్కెట్లను అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఆర్ భవానీ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అలంకరణలో కనక దుర్గమ్మ

వైభవంగా దుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం

పెనుగొండ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పెనుగొండలోని జద్దువారి వీధిలో కనకదుర్గమ్మ ఆలయ 31వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. సోమవారం ఉదయం కుంకుమార్చన నిర్వహించారు. అర్చకులు శివరామకృష్ణ, కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

తిరుమలలో చెరుకువాడ చిన్నారి నృత్య ప్రదర్శన



ఉండి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని హిందూ ధర్మప్రచార పరిషత్ సౌజన్యంతో అన్నమాచార్య ఆర్ట్స్ అకాడమి ఆస్థాన మండపంలో చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శనలో చెరుకువాడ గ్రామానికి చెందిన చిన్నారి వెలిగట్ల దివ్యాన్‌పణి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను అలరింపజేసింది. కూచిపూడి నృత్యంలో శిక్షణ తీసుకున్న ఈచిన్నారి తిరుమల తిరుపతి దేవస్థాన ఆస్థాన మండపంలో కూచిపూడి నృత్య ప్రదర్శన చేయడం పట్ల స్థానిక ప్రజాప్రతినిధులు అభినందించారు.

నిల్వ నీటిని తొలగించాలని ఆందోళన

భీమవరం టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): భీమవరం మునిసిపాలిటీకి చైర్మన్, కౌన్సలర్లు లేకపోవడం వల్లే సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి జె.ఎన్.వి గోపా లన్, పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు అన్నారు. సోమవారంనాడు సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం మార్కెట్‌లో ఉన్నటు వంటి రైల్వే అండర్ బ్రిడ్జిలో నిండిన నీటిని తొలగించాలని ఆందోళన నిర్వహించారు. ఈ ఆందోళనలో చుట్టు పక్కల ఉన్నటువంటి వ్యాపారులు, కాలినడకన, ద్విచక్రవాహనాలపై వెళ్లే వారు పాల్గొని చాలా ఇబ్బందులు పడుతున్నామన్నారు. కార్యక్రమం అనంతరం మునిసిపల్ అధికారులకు ఫోన్‌లో వివరించగా అధికారులు మోటార్లతో నీటిని తొలగించారు.

పౌర హక్కులపై అవగాహన

పాలకోడేరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పౌర హక్కుల దినోత్సవం పురస్కరించుకుని సోమవారం పాలకోడేరు మండలం కోరుకొల్లు గ్రామంలో సర్పంచ్ మంతెన భారతిదేవి అధ్యక్షతన పౌర హక్కులపై అవగాహన కార్యక్రమం జరిగింది. విశిష్ట అతిథిగా విచ్చేసిన తహసీల్దార్ ఎన్. భారతి విజయలక్ష్మి మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ తోటి వారిని గౌరవించుకోవాలని, కుల మత బేధాలకు తావు లేకుండా ప్రతి ఒక్కరూ సహృదయ భావంతో కలిసి మెలిసి ఉండాలన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

మొగల్తూరు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీనివాస ఆసుపత్రిలో మంగళవారం ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహించనున్నట్టు డాక్టర్ శ్రీనివాసరాజు తెలిపారు. పాలకొల్లుకు చెందిన రాజవల్లి రాధారమణ లయన్స్ కంటి ఆసుపత్రి వైద్యులచే ఉచిత కంటివైద్య సేవలు అందించనున్నారని తెలిపారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

భీమవరం టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యతని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని టీడీపీ రాష్ట్ర యాదవ సాధికారిత కమిటీ డైరెక్టర్ కొండ్రు శ్రీనివాస్ అన్నారు. సోమవారం భీమవరం సంస్కార్ స్కూల్లో మొక్కలు పంపిణీ చేశారు. స్కూల్ డైరెక్టర్ నందమూరి నాగ ప్రశాంతి, నిర్వాహకులు రంగసాయి పాల్గొన్నారు.

లయన్స్ సేవలు భేష్



ఎమ్మెల్యే ఆరిమిల్లిని సన్మానిస్తున్న లయన్స్ సభ్యులు

తణుకు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): సమాజానికి లయన్స్ ద్వారా అందించే సేవలు మరువలేనివని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. సోమవారం రాత్రి లయన్స్ క్లబ్ నూతన కమిటి ప్రమాణ స్వీకారానికి ఆయన విచ్చేశారు. క్లబ్ అధ్యక్ష, కార్యద ర్శులుగా కోడూరి వెంకట సత్యనా రాయణ, పితాని వెంకట రమణ, సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఆంధ్రజ్యోతి బ్రాంచి మేనేజర్ బత్తుల హరిబాబు పాల్గొన్నారు.

ఆచంట మానవత సభ్యుల ప్రమాణ స్వీకారం



ఆచంట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఆచంట కమ్మ సంఘం కల్యాణ మండపంలో 2025 -26 సంవత్సరానికి గాను మానవత స్వచ్ఛంద సంస్థ నూతన సభ్యుల ప్రమాణస్వీకారం వేడుకగా జరిగింది. మండల అధ్యక్షుడుగా సజ్జా నారాయణ, కార్యదర్శిగా గున్నాబత్తుల ఆనంద్ కుమార్, కోశాధికారిగా మడిచర్ల సతీష్, ఉపాధ్యక్షుడుగా తమ్మినీడి సత్యనారాయణమూర్తి, సహాయ కార్యదర్శి గా మానేపల్లి వెంకటేశ్వరరావు, కేతా రామకృష్ణారావు, నాగేశ్వరరావు, బొక్కా రామకృష్ణ, షేక్ ముజుబుల్ రహ్మాన్‌లు, ప్రమాణస్వీకారం చేశారు.

పార్టీ పటిష్టత కోసం పనిచేయాలి

తణుకు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పట్టణ కమిటీల్లో స్థానం సంపాధించిన ప్రతి ఒక్కరు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అధికారంలోకి వచ్చేవిధంగా పార్టీ పటిష్టత కోసం పనిచేయాలని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో పట్టణంలోని 5,7,8,27 వార్డులకు సంబంధించి కొత్త కమిటీలను ప్రకటించారు. 5వవార్డు అధ్యక్ష, కార్యదర్శులుగా నొడగల బాలాజీ, గమిని లక్ష్మి వెంకట ప్రశాంత్, 7వ వార్డుకు ఊట రామకృష్ణ, యడ్లపల్లి దుర్గాప్రసాదు, 8వ వార్డుకు చిన్నం సత్యనారాయణ, పులసరి శ్రీనివాసు, 27వ వార్డుకు కొత్తలంక సుబ్రహ్మణ్యం, షేక్ అబ్దుల్లా బాజీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. టీడీపీ నాయకులు మంత్రిరావు వెంకటరత్నం, కల గర వెంకట కృష్ణ, సుబ్బారావు, రాంబాబు పాల్గొన్నారు.

వయో వృద్ధులను గౌరవించాలి

భీమవరం టౌన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ వయోవృద్ధులను గౌరవంగా చూడాలని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అన్నారు. భీమవరం శ్రీకృష్ణదేవరాయ కళ్యాణ మండపంలో సోమవారం సీనియర్ సిటిజన్స్ ఫోరం ఫర్ బెటర్ సొసైటీ దశాబ్ది వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే అంజిబాబు, హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి ఆకుల శేషసాయి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి ఆకుల శేషసాయి మాట్లాడుతూ ఇప్పుడున్న బిజీ ప్రపంచంలో చాలా మందికి తమ కుటుంబాల్లోని పెద్ద వయస్సు వారిని చూసుకోవడం ఇబ్బందిగా మారుతోందని, ప్రతిక్షణం కంటికి రెప్పలా కాపాడుకోవాలని ఉన్నా అది ప్రాక్టికల్గా సాధ్యపడకపోవచ్చునని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే రామాంజనేయులును సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి, నల్లం వెంకట నాగేశ్వరరావు, వెంపరాల నారాయణమూర్తి పాల్గొన్నారు.

మునిసిపల్ వేలం పాట రద్దు

నరసాపురం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ మార్కెట్ పాట మళ్లీ రద్దు అయింది. సోమవారం కౌన్సిల్ హాల్‌లో నిర్వహించిన పాటకు నలుగురు పాటదారులు ధరావత్తు కట్టి పాల్గొన్నారు. ప్రారంభ ధరను రూ.47లక్షలుగా నిర్ణయించి పాట పెట్టారు. అయితే పాడేందుకు ఎవరూ ఆసక్తి చూపిలేదు. ప్రారంభ ధర ఇంకా తగ్గించాలని కమిషనర్ అంజయ్యను కోరారు. గత మూడు నెలలుగా మునిసిపల్ సిబ్బంది వ్యాపారుల నుంచి రూ. 10, 20 చొప్పున వసూలు చేశారన్నారు. ఇప్పుడు పెద్ద మొత్తంలో పాడి తాము వ్యాపారుల వద్దకు వెళితే మాకు కూడా ఇదే చెల్లిస్తారన్నారు.

ఎస్సై కుటుంబానికి పరామర్శ

నరసాపురం టౌన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఆలమూరు ఎస్సై అశోక్ కుటుంబ సభ్యుల్ని సోమవారం మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు పరామర్శించారు. ఎస్సై ఇంటికి వెళ్లి ఆయన సోదరులు, భార్యను పరామర్శించి ధైర్యంగా ఉండాలని అన్నారు.



మాట్లాడుతున్న పొత్తూరి రామరాజు

ఏడాది పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

నరసాపురం టౌన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పాలన ఏడాది పూర్తయిన సందర్భంగా చేసిన అభివృద్ధి, హామీల అమలు, ఇతర సంక్షేమ పథకాలను పార్టీ కేడర్ ప్రజల్లోకి తీసుకెళ్లాలని టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు పిలుపునిచ్చారు. సోమవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన క్లస్టర్ల సమావేశంలో పొత్తూరి మాట్లాడుతూ సుపరిపాలనలో తొలి అడుగు పేరుతో నిర్వహిస్తున్న డోర్‌టూ డోర్ ప్రచారంలో పార్టీ శ్రేణులంతా పాల్గొనాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆకివీడు రూరల్ జూన్ 30(ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతులు కారణంగా మంగళవారం ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు చినకాపవరం, గొల్లగూడెం ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

నరసాపురం రూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతులు కారణంగా బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఈపీడీసీఎల్ ఈఈ మధుకుమార్ తెలిపారు. మండలంలోని కొప్పర్రు, లిఖితపూడి, సీతారాంపురం, సరిపల్లి, వైఎస్‌పాలెం, రుస్తుంబాదా, మంగళగుండపాలెం ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

42 వినతులు స్వీకరణ

నరసాపురం టౌన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ స్కూళ్లల్లో ప్రభుత్వం 25శాతం ఉచిత అడ్మిషన్ ఇవ్వాలని చెప్పినా... నాకుమారుడికి స్కూల్‌లో అడ్మిషన్ ఇవ్వలేదని సోమవారం ఆర్డీవో దాసిరాజుకు అడబాల రాజేష్ ఫిర్యాదు చేశారు. సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆర్డీవోను కలిశారు. పట్టణంలోని సికిలీ స్కూల్ యాజమాన్యం ఫ్రీ సీటు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని పేర్కొన్నారు. అనంతరం ప్రజల నుంచి 42 వినతులు స్వీకరించారు.

డీఎస్సీ పరీక్షకు 13 మంది గైర్హాజరు

భీమవరం రూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మెగా డీఎస్సీ పరీక్ష మూడు కేంద్రాల్లో సోమవారం జరిగింది. పరీక్షకు 360 మంది హాజరు కావాల్సి ఉండగా 347 మంది హాజరయ్యారు. 13 మంది గైర్హాజరయ్యారు. ఏ విధమైన మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని డీఈవో నారాయణ తెలిపారు.

సివిల్ రైట్స్ డే

నరసాపురం టౌన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆరుంధతిపేటలో సోమవారం సివిల్ రైట్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి తహసీల్దార్ ఐవివి సత్యనారాయణ ముఖ్య అతిథిగా విచ్చేశారు. సివిల్ రైట్ డే ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆర్ఐ లక్ష్మినారాయణ పాల్గొన్నారు.